RNI No. APTEL/2009/28868

ప్రజల కోసం... ప్రజల పక్షాన...
నిజం మా నడవడి...

సిటిజన్ టైమ్స్

తెలుగు దినపత్రిక

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

PEOPLE ISSUES OUR MISSION

TRUTH BRINGS A BETTER SOCIETY

CITIZEN TIMES TELUGU DAILY

సంపుటి :18 | సంచిక : 357 | సంపాదకులు : కంచర్ల సందీప్ కుమార్ | ప్రచురణ : విశాఖపట్నం | 1-11- 2026 | పేజీలు : 8 | వెల : 2/- రూ॥

VOLUME: 18 | ISSUE : 357 | EDITOR:KANCHERLA SANDEEP KUMAR | PUBLISHED: VISAKHAPATNAM | 1-11-2026 | PAGES: 8 | PRICE : 2/- RS

అనంతపురం జిల్లాలో పదోతరగతి విద్యార్థినిపై

రంపంతో ఉన్మాది దాడి

రాష్ట్రాడు ఘటనపై సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి.. కఠిన చర్యలకు ఆదేశం

బాధితురాలి తల్లికి చంద్రబాబు ఫోన్





రాప్తాడు, సిటిజన్ టైమ్స్

అనంతపురం జిల్లా రాప్తాడు మండలంలో దారుణం చోటు చేసుకుంది. ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థినిపై ఓ ఉన్మాది రంపంతో దాడి చేశాడు. దీంతో ఆమె ముఖం, తల, వీపు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థిని కూడా గాయపడింది. అప్రమత్తమైన సహచర విద్యార్థులు, ఉపాధ్యాయులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ప్రాణాపాయంలో ఉన్న బాలికను చికిత్స నిమిత్తం దగ్గర్లోని ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడి కోసం గాలింపు

తరువాయి 2లో..



బంగాళాఖాతంలో వాయుగుండం..


అమరావతి, సిటిజన్ టైమ్స్

అర్నబ్ తుపాను నష్టం నుంచి కోలుకోక ముందే ఆంధ్రప్రదేశ్‌కు మరో తుపాను ముప్పు పొంచి ఉంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడింది. ఆగ్నేయ బంగాళాఖాతం, అండమాన్ సముద్ర ప్రాంతాల్లో ఇది కేంద్రీకృతమైంది. రానున్న 12 గంటల్లో ఇది తీవ్ర వాయుగుండంగా బలపడే అవకాశముంది. రేపు సాయంత్రానికి తుపానుగా మారి.. ఎల్లుండి సాయంత్రానికి తీర ప్రాంతానికి చేరుకునే అవకాశం ఉందని వాతావరణశాఖ అంచనావేస్తోంది. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

పలు జిల్లాల్లో భారీ వర్షాలు...: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రస్తుతం శ్రీవిజయపురానికి 330 కి.మీ, నికోబార్‌కు 300 కి.మీ, చెన్నైకి తూర్పు- ఆగ్నేయ దిశలో 1140 కి.మీ, మచిలీపట్నానికి ఆగ్నేయ దిశలో 1200 కి.మీ. దూరంలో కేంద్రీకృతమైంది. దీని ప్రభావంతో వచ్చే మూడు రోజులు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ తెలిపింది. ఆదివారం కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు జిల్లాల్లో అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు, మిగతా జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. సోమవారం ఏలూరు, పశ్చిమగోదావరి, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల,

తరువాయి 2లో..

రెస్క్యూ మిషన్ విఫలం.. భూమిపై కూలిపోనున్న టెలిస్కోప్



న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

దాదాపు 22 ఏళ్లుగా అంతరిక్షంలో సేవలందిస్తున్న నాసాకు చెందిన 'స్విఫ్ట్ అబ్జర్వేటరీ' అనే భారీ టెలిస్కోప్ త్వరలో భూమిపై కూలిపోనుంది. ఈ టెలిస్కోప్ రెస్క్యూ కోసం చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో.. అది అంతకంతకూ కిందికి దిగుతూ.. అతికష్టంగా ప్రయాణిస్తోంది. నేడో రేపో భూమిపై కూలిపోవచ్చని యూఎస్ స్పేస్ ఫోర్స్ అంచనా వేస్తోంది. సుమారు ఒకటిన్నర టన్ను బరువున్న ఈ పరికరం చాలావరకు వాతావరణంలోనే కాలిపోతుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. కొన్ని భాగాలు, అద్దాల ముక్కలు మాత్రం భూమిపై పడే అవకాశాలు ఉన్నాయని మిషన్ ముఖ్య శాస్త్రవేత్త, నాసాకు చెందిన

తరువాయి 2లో..

ఉన్మాది దాడిలో గాయపడిన విద్యార్థిని బెంగళూరు తరలింపు..

గ్రీన్ చానల్ ఏర్పాటుకు లోకేశ్ చొరవ

ఉన్మాది దాడిలో తీవ్రంగా గాయపడిన విద్యార్థినిక మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలింపు

మంత్రి నారా లోకేశ్ చొరవతో మెరుగైన వైద్యం ఏర్పాట్లు

బెంగళూరు మణిపాల్ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడిన లోకేశ్

గ్రీన్ ఛానల్ కోసం కర్ణాటక ప్రభుత్వంతో సంప్రదింపులు

అధికారులు, వైద్యులతో ఎప్పటికప్పుడు సమీక్ష



అనంతపురం, సిటిజన్ టైమ్స్

అనంతపురం జిల్లా రాప్తాడులోని జడ్పీ హైస్కూల్‌లో ఉన్మాది దాడిలో తీవ్రంగా గాయపడిన పదో తరగతి విద్యార్థినిని మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవతో ఈ ఏర్పాట్లు చకచకా జరిగాయి. బాలికను బెంగళూరులోని ప్రఖ్యాత మణిపాల్ ఆస్పత్రిలో చేర్పించి, అత్యుత్తమ వైద్యం అందించాలని మంత్రి ఆదేశించారు. విషయం తెలిసిన వెంటనే స్పందించిన మంత్రి లోకేశ్, విద్యార్థినిని బెంగళూరు తరలించడానికి ముందే మణిపాల్ ఆసుపత్రికి చెందిన ఉన్నతస్థాయి వైద్యులతో ఫోన్‌లో మాట్లాడారు. బాలిక ఆరోగ్య పరిస్థితిని

తరువాయి 2లో..

జైల్ బ్రేక్ ఘటన..

సీఎం విజయ్ కీలక ఆదేశాలు

న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

తమిళనాడులోని తేని జిల్లా తెక్కంపట్టి సబ్ జైలు నుంచి సినీఫక్కీలో 17మంది ఖైదీలు పారిపోయిన ఘటనపై

తరువాయి 2లో..



అమరావతికి చేరుకున్న కేంద్ర బృందం..

అర్నబ్ తుపాను నష్టంపై సమీక్ష

రాష్ట్రంలో ప్రాథమికంగా రూ.4764 కోట్ల నష్టం వాటిల్లినట్లు అధికారుల వెల్లడి

విపత్తు నిర్వహణలో ఆర్టీజీఎస్, 'మన మిత్ర' పనితీరుపై కేంద్రం ప్రశంస

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర బృందం రెండు రోజుల పర్యటన



అమరావతి, సిటిజన్ టైమ్స్

అర్నబ్ తుపాను కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర బృందం రాష్ట్రానికి చేరుకుంది. కేంద్ర హోం శాఖ సంయుక్త కార్యదర్శి చిత్తరంజన్ దాస్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల బృందం సచివాలయానికి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు బృందానికి స్వాగతం పలికారు. అనంతరం సచివాలయంలోని ఆర్టీజీఎస్ (రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ) కేంద్రాన్ని సందర్శించిన కేంద్ర బృందానికి, ఆర్టీజీఎస్ అధికారులు తుపాను నష్టంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రాథమిక అంచనాల ప్రకారం, తుపాను వల్ల రాష్ట్రానికి రూ.4764 కోట్ల నష్టం వాటిల్లిందని, 12 జిల్లాలు ప్రభావితమయ్యాయని

తరువాయి 2లో..

జగన్ అక్రమాస్తుల కేసుల విచారణలో పెరిగిన వేగం



హైదరాబాద్, సిటిజన్ టైమ్స్

జగన్ అక్రమాస్తుల కేసుల విచారణలో వేగం పెరిగింది. ఇండియా సిమెంట్స్ కేసులో డిశ్చార్జి పిటిషన్లపై విచారణ ముగిసింది. ఇప్పటివరకు ఆరు సీబీఐ ఛార్జిషీట్లలో డిశ్చార్జి పిటిషన్లపై విచారణ పూర్తయింది. భారతీ సిమెంట్స్ కేసులో డిశ్చార్జి పిటిషన్ల విచారణ మొదలైంది. సీబీఐతో పాటు ఈడీ కేసుల్లోనూ రోజువారీ విచారణ జరుగుతోంది. సీబీఐ కోర్టులో ఇప్పటి వరకు మొత్తం 45 డిశ్చార్జి పిటిషన్లపై విచారణ పూర్తయింది. జగన్‌తో పాటు

తరువాయి 2లో..

92 చోట్లే పుర ఎన్నికలు

8 చోట్ల చైర్‌పర్సన్ సహా కౌన్సిలర్లూ ఏకగ్రీవం

2,382 మేయర్, చైర్‌పర్సన్, కార్పొరేటర్, కౌన్సిలర్ స్థానాలకు రేపు పోలింగ్

పోటీలో 6,669 మంది అభ్యర్థులు -ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం

11,705 పోలింగ్ కేంద్రాల్లో ఓటేయనున్న 99.36 లక్షల మంది



అమరావతి, సిటిజన్ టైమ్స్

రాష్ట్రంలో ఎనిమిది పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో ఛైర్‌పర్సన్ సహా వార్డు సభ్యుల (కౌన్సిలర్ల) స్థానాలు ఏకగ్రీవం కావడంతో ఆదివారం (నవంబరు 1న) 92 పట్టణ స్థానిక సంస్థలకే పోలింగ్ నిర్వహించనున్నారు. వీటిలో 13 నగరపాలక సంస్థలు, 79 పురపాలక సంఘాలు, నగర పంచాయతీలు ఉన్నాయి. వీటిలో మొత్తం 2,382 స్థానాలకు 11,705 పోలింగ్ కేంద్రాల్లో 99,36,014 మంది ఓటు హక్కు వినియోగించుకునేందుకు అధికారులు ఏర్పాట్లు

తరువాయి 2లో..

ఎడిటోరియల్

తెలంగాణా టూ ఏపీ

బాబుకు రెండిందాల సపోర్ట్ !

చంద్రబాబుని ఊరకే రాజకీయ చాణక్యుడు అని ఎవరూ అనలేదు. ఆయనకు ఆ సామర్థ్యం సత్తా ఉన్నాయి కాబట్టే ఆలా అభివర్ణిస్తారు. బాబు వాస్తవ వాదిగా చెబుతారు. ఆయన రాజకీయాలను అలాగే చూస్తారు, అలాగే చేస్తారు. అందుకే ఆయనకు రాజకీయంగా ప్రత్యర్థులే ఉంటారు, వారు కూడా కీలక సమయాల్లో స్నేహ హస్తం అందిస్తారు. బాబు విషయంలో సాఫ్ట్ కార్నర్ చూపించడానికి ఆయన ఎంచుకున్న విధానమే కారణం అంటారు. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు ఉండరని బాబు గట్టిగా నమ్ముతారు. అదే ఆయనకు జాతీయ స్థాయి నుంచి ప్రాంతీయంగా అందరి నేతలకూ దగ్గర చేసింది అన్నది ఒక కరెక్ట్ విశ్లేషణగానే చూడాల్సి ఉంది. ఏపీ చూస్తే భారీ ఎత్తున నష్టపోయింది. ఆర్నాడ్ తుఫాన్ వల్ల ఏపీలో మౌలిక వ్యవస్థ పూర్తిగా దెబ్బ తింది. దాంతో తెలంగాణా ప్రభుత్వం సాయం అందించడానికి ముందుకు వచ్చింది. విపత్తు వేళ ఏపీని ఆదుకోవాలని సీఎం రేవంత్ కీలక నిర్ణయం తీసుకున్నారు. అలాగే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అయితే ఏపీలో విద్యుత్ వ్యవస్థని పునరుద్ధరించడానికి పరికరాలను సిబ్బందిని పంపించారు. తుపాను వల్ల రాష్ట్రంలో 16 వేలకు పైగా విద్యుత్ స్తంభాలు నేలకూలాయని వందలాది గ్రామాల్లో విద్యుత్ నిలిచిపోయింది. దీంతో తెలంగాణా ప్రభుత్వం ఆదేశాల మేరకు తెలంగాణ డిస్కంలు దాదాపు రెండు వేల మంది విద్యుత్ సిబ్బందిని అత్యవసర సామగ్రిని ఏపీకి పంపించారు. ఈ సిబ్బంది ఏపీలోని ఉత్తరాంధ్ర మరియు ఇతర ప్రభావిత జిల్లాల్లో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు, లైన్ల మరమ్మతులు చేపట్టారు. బాబు సుదీర్ఘమైన అనుభవం ఉన్న నాయకుడు కావడంతో పాటు తెలంగాణా రాష్ట్రంతో ఇచ్చి పుచ్చుకునే వైఖరిని అనుసరించడం వల్లనే ఈ రోజు ఆ రాష్ట్రం కష్ట కాలంలో ఏపీకి సాయం చేసింది అని అంటున్నారు. రెండు రాష్ట్రాలు అభివృద్ధి చెందాలని కలసి ముందుకు సాగాలని బాబు ఎపుడూ చెబుతూంటారు. జల వివాదాల విషయంలో ఆయన అదే మాట అంటూ వచ్చారు. బాబు ఉమ్మడి ఏపీకి సీఎం గా తొమ్మిదేళ్ళ పాటు కొనసాగారు. దాంతో ఆయనకు రెండు రాష్ట్రాల ప్రజల విషయంలో అభిమానం అవగాహన ఉంది. అలాగే రాజకీయ పార్టీలతో నేతలతో కూడా మంచి రిలేషన్స్ ఉన్నాయి. అదే ఇపుడు అక్కరకు వచ్చిందని గుర్తు చేస్తున్నారు. మరో వైపు చూస్తే దాదాపుగా ఒకే సమయంలో తెలంగాణా విపక్షం కూడా బాబుకి కితాబు ఇచ్చింది. అక్కడ ప్రధాన ప్రతిపక్షం అయిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బాబు ముందు చూపుని ఆయన దార్శనికతను కొనియాడిన సంగతి తెలిసిందే. ఎల్ నినో ముప్పుని ముందుగా పసిగట్టి బాబు నీటి ప్రాజెక్టుల విషయంలో తీసుకున్న చర్యలను కొనియాడారు. దీనిని బట్టి చూస్తే తెలంగాణాలోని అధికార పక్షం ఏపీ మీద సానుకూలంగా ఉంది, అలాగే విపక్షం కూడా కితాబు ఇస్తోంది. అలా రెండు భిన్న దృక్కోణం కలిగిన రాజకీయం ఏపీ వరకూ వచ్చేసరికి ఒకే మాటగా ఉండడం అంటే బాబు గ్రేటే మరి అనిపించకమానదు అంటున్నారు.

అనంతపురం జిల్లాలో పదోతరగతి విద్యార్థినిపై

రంపంతో ఉన్మాది దాడి

ముమ్మరం చేశారు. ఈ ఘటనతో పాఠశాలలో భయాందోళనలు నెలకొన్నాయి.

అనంతపురం జిల్లా రాప్తాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినిపై జరిగిన అమానుష దాడి పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి, ఆవేదన వ్యక్తం చేశారు. తరగతి గదిలోనే ఓ ఉన్మాది రంపంతో బాలికపై దాడికి పాల్పడటం అత్యంత దారుణమని అన్నారు. ఈ ఘటన తెలిసిన వెంటనే ఆయన అధికారులతో మాట్లాడారు. దాడిలో తీవ్రంగా గాయపడిన విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిని, ఆమెకు అందుతున్న చికిత్స వివరాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు సూచించారు. ఈ అమానుష ఘటనకు పాల్పడిన నిందితుడిని తక్షణమే అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, నిందితుడికి చట్టపరంగా కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

విద్యార్థిని తల్లితో ఫోన్‌లో మాట్లాడిన సీఎం చంద్రబాబు

అనంతపురం జిల్లాలోని రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్మాది దాడిలో తీవ్రంగా గాయపడిన పదో తరగతి విద్యార్థిని తల్లితో ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోన్‌లో మాట్లాడారు. ఈ కష్టకాలంలో ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. నిందితుడిని కఠినంగా శిక్షిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "మీరు ధైర్యంగా ఉండండి. మీ కుమార్తెను కాపాడుకునేందుకు అవసరమైన అన్ని ప్రయత్నాలు చేద్దాం. ప్రభుత్వం మీకు అండగా నిలుస్తుంది" అని భరోసా ఇచ్చారు. ఈ దారుణానికి పాల్పడిన నిందితుడిని తక్షణమే పట్టుకుని చట్ట ప్రకారం కఠినంగా శిక్షిస్తామని ఆయన స్పష్టం చేశారు. అనంతరం, విద్యార్థినికి అందుతున్న వైద్య సేవలు, ఆరోగ్య పరిస్థితిపై ముఖ్యమంత్రి స్థానిక ఎమ్మెల్యే పరిటాల సునీతతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించడంలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని సూచించారు. ఇదే ఘటనలో గాయపడిన మరో విద్యార్థినికి కూడా అత్యుత్తమ చికిత్స అందించాలని సంబంధిత అధికారులను సీఎం ఆదేశించారు. పాఠశాలలో జరిగిన ఈ ఘటనపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఇలాంటి ఘటనలకు సమాజంలో చోటు లేదు: పవన్ కల్యాణ్

రాప్తాడు ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి అమానవీయ ఘటనలకు సమాజంలో చోటు లేదన్నారు. అనంతపురం జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. బాధితురాలితోపాటు గాయపడిన మరో విద్యార్థిని కూడా మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. విద్యార్థిని కుటుంబానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని తెలిపారు. నిందితుడిని తక్షణం అరెస్టు చేసి, చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని పోలీసుశాఖకు దిశానిర్దేశం చేశారు.

ఆస్పత్రికి వెళ్లి పరామర్శించిన ఎమ్మెల్యే సునీత

బాధిత బాలికకు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రి ఎమర్జెన్సీ వార్డు ఆపరేషన్ థియేటర్‌లో వైద్యులు శస్త్రచికిత్స నిర్వహిస్తున్నారు. ఆస్పత్రికి చేరుకున్న ఎమ్మెల్యే పరిటాల సునీత వైద్యులతో మాట్లాడారు. బాలిక ఆరోగ్య పరిస్థితి గురించి వాకబు చేశారు. అనంతరం బాలిక కుటుంబ సభ్యులను సీఎం చంద్రబాబుతో ఫోన్‌లో మాట్లాడించారు. బాధిత కుటుంబాన్ని సీఎం పరామర్శించి.. భరోసా ఇచ్చారు.

స్పందించిన ఏపీ మహిళా కమిషన్..

రాప్తాడు ఘటనను ఏపీ మహిళా కమిషన్ తీవ్రంగా పరిగణించింది. పదో తరగతి విద్యార్థినిపై రంపంతో దాడి ఘటనపై మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డా.రాయపాటి శైలజ స్పందించారు. దాడిని అడ్డుకునే క్రమంలో గాయపడిన మరో విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిపైనా ఆరా తీశారు. విద్యార్థినులిద్దరికీ అందుతున్న వైద్యంపై ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకుంటూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

92 చోట్లే పుర ఎన్నికలు

చేస్తున్నారు. 100 పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం మొదట నోటిఫికేషన్ ఇచ్చింది. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణలు, ఏకగ్రీవాల తరువాత 92 పురపాలికల్లో 6,669 మంది బరిలో నిలిచారు. కార్పొరేషన్, మున్సిపల్ కార్యాలయాల నుంచి శనివారం ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలకు సామగ్రి తరలించనున్నారు. అత్మకూరు మున్సిపాల్టీలోని 20వ వార్డులో నామినేషన్లు వేసిన వారంతా ఉపసంహరించుకోవడంతో ప్రస్తుతం ఎన్నికలు నిర్వహించడం లేదు. పాలకవర్గమంతా ఏకగ్రీవమైన పురపాలక సంఘాలు, నగర పంచాయతీలు: పిడుగురాళ్ల, దాచేపల్లి, గురజాల, దర్శి, ప్రొద్దుటూరు, కమలాపురం, రాయచోటి, ఆళ్లగడ్డ

నగరపాలక సంస్థల్లో..

మేయర్ స్థానాలు: 13
పోటీలో ఉన్న అభ్యర్థులు: 153
డివిజన్ స్థానాలు: 922
ఏకగ్రీవమైనవి: 118
పోలింగ్ నిర్వహిస్తున్నది: 804
బరిలో ఉన్న అభ్యర్థులు: 3,073
పోలింగ్ కేంద్రాలు: 6,384
మొత్తం ఓటర్లు: 59,97,918

పురపాలక, నగర పంచాయతీల్లో..

ఛైర్‌పర్సన్ స్థానాలు: 87
ఏకగ్రీవమైనవి: 17
పోలింగ్ నిర్వహిస్తున్నది: 70
పోటీలో ఉన్న అభ్యర్థులు: 367
వార్డు స్థానాలు: 3,020
ఏకగ్రీవమైనవి: 637
పోలింగ్ నిర్వహిస్తున్నది: 2,382
బరిలో ఉన్న అభ్యర్థులు: 6,669
పోలింగ్ కేంద్రాలు: 5,321
మొత్తం ఓటర్లు: 39,38,096.

ఉన్మాది దాడిలో గాయపడిన విద్యార్థిని బెంగళూరు తరలింపు..

గ్రీన్ చానల్ ఏర్పాటుకు లోకేశ్ చొరవ

వివరించి, సాధ్యమైనంత ఉత్తమమైన చికిత్స అందించాలని వారిని కోరారు. అంతేకాకుండా, అంబులెన్స్ వేగంగా, ఎలాంటి ఆటంకాలు లేకుండా ఆసుత్రికి చేరుకునేందుకు వీలుగా గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేయాలని కర్ణాటక ప్రభుత్వంతో మంత్రి లోకేశ్ నేరుగా సంప్రదింపులు జరిపారు. దాడి ఘటన తెలిసిన క్షణం నుంచే మంత్రి లోకేశ్.. పోలీసు, విద్య, జిల్లా అధికార యంత్రాంగాలను అప్రమత్తం చేశారు. ప్రతిక్షణం అధికారులతో మాట్లాడుతూ పరిస్థితిని సమీక్షించారు. బాధితురాలికి మెరుగైన వైద్య సహాయం అందించడమే ఏకైక లక్ష్యంగా జిల్లా యంత్రాంగం, వైద్యులతో సమన్వయం చేసుకుంటూ బెంగళూరు తరలింపు ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించారు. బాధితురాలి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

చిన్నారి చెల్లిని క్లాస్ రూములో నెత్తుటి మడుగులో చూశాక కన్నీళ్లు ఆగడం లేదు: నారా లోకేశ్

అనంతపురం జిల్లా రాప్తాడులో పదో తరగతి విద్యార్థినిపై జరిగిన అమానుష దాడిపై రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారు. ఈ ఘటన తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని, గుండె బరువెక్కిందని ఆవేదన వ్యక్తం చేశారు. "చిన్నారి చెల్లిని క్లాస్ రూములో నెత్తుటి మడుగులో చూశాక కన్నీళ్లు ఆగడం లేదు. ఉన్మాది ఘాతుకం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది," అని ఆయన అన్నారు. ఆడపిల్లలు, మహిళల భద్రత విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని, ఉన్మాదులను ఉక్కుపాదంతో అణిచివేస్తామని లోకేశ్ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. మహిళల వైపు కన్నెత్తి చూడాలంటేనే భయపడే వాతావరణం సృష్టిస్తామని ఆయన స్పష్టం చేశారు. పిల్లల భద్రత విషయంలో నిర్లక్ష్యం వహించేవారు ఎంతటివారైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అసలేం జరిగిందంటే..

రాప్తాడు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉదయం ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. ఓ వ్యక్తి నేరుగా పదో తరగతి గదిలోకి ప్రవేశించి, అక్కడ ఉన్న విద్యార్థినిపై చెట్ల కొమ్మలు నరికే రంపంతో విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో బాలిక ముఖం, తల, వీపు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను రక్షించేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థినిపై కూడా దుండగుడు దాడి చేసి గాయపరిచాడు. ఈ ఘటనతో పాఠశాలలో ఒక్కసారిగా భయాందోళనలు నెలకొన్నాయి. ఉపాధ్యాయులు వెంటనే పోలీసులకు సమాచారం అందించి, తీవ్రంగా గాయపడిన బాలికను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

పోలీసుల అదుపులో నిందితుడు

ఘటన జరిగిన వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడి కోసం గాలింపు ముమ్మరం చేశారు. ధర్మవరం వైపు పారిపోతుండగా అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు ధర్మవరం మండలానికి చెందిన యువకుడిగా గుర్తించారు. బాధితురాలికి అతను దగ్గరి బంధువేనని స్థానికులు చెబుతున్నారు. వ్యక్తిగత కక్షల కారణంగానే ఈ దాడి జరిగి ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు.

అమరావతికి చేరుకున్న కేంద్ర బృందం..

అర్నబ్ తుపాను నష్టంపై సమీక్ష

తెలిపారు. ముఖ్యంగా కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విపత్తు నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన విధానాలపై కేంద్ర బృందం ప్రత్యేక ఆసక్తి చూపింది. ముఖ్యంగా 'మన మిత్ర' వాట్సాప్ వేదిక ద్వారా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, వాటిని రియల్ టైమ్‌లో పరిష్కరించడాన్ని అధికారులు అభినందించారు. ఇదొక మంచి ప్రయత్నమని, ఇతర రాష్ట్రాలు కూడా ఇలాంటి విధానాన్ని అనుసరించేలా సూచిస్తామని కేంద్ర బృందం సభ్యులు పేర్కొన్నారు. ఈ బృందం నేటి నుంచి రెండు రోజుల పాటు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించనుంది. క్షేత్రస్థాయిలో నష్టాన్ని పరిశీలించిన తర్వాత కేంద్రానికి నివేదిక సమర్పించనుంది. రాష్ట్రానికి అవసరమైన సాయం అందేలా చూస్తామని కేంద్ర బృందం హామీ ఇచ్చింది.

మొదటి పేజీ తరువాయి

ఏపీకి మరో తుపాను ముప్పు

పల్నాడు, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు, తూర్పుగోదావరి, కోనసీమ, నంద్యాల, కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపారు. మంగళవారం.. విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ అతిభారీ వర్షాలు, కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడించారు.

అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం రేపటికి తుపానుగా బలపడే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించారు. సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ కేంద్రంలో ఉన్నతాధికారులతో వాతావరణ పరిస్థితులు, ఆర్నబ్ తుపాను అనంతరం కొనసాగుతున్న పునరుద్ధరణ పనులపై సీఎం సమీక్షించారు. మరో తుపాను ప్రభావంతో గుంటూరు దిగువన ఉన్న దక్షిణ కోస్తా జిల్లాలతో పాటు రాయలసీమలో వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు తెలిపారు. నవంబరు 2, 3, 4 తేదీల్లో పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే సూచనలున్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చంద్రబాబు ఆదేశించారు. ఉపగ్రహ చిత్రాలు, డాప్లర్ రాడార్ల ద్వారా తుపాను గమనాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమీక్షలో ఐటీ కార్యదర్శి కాటమనేని భాస్కర్‌తో పాటు విద్యుత్, విపత్తుల నిర్వహణ శాఖల అధికారులు, వివిధ టెలికాం సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

జైల్ బ్రేక్ ఘటన..

సీఎం విజయ్ కీలక ఆదేశాలు

దర్యాప్తు కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో సీఎం విజయ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు గానూ జైలు డిప్యూటీ సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేయాలని ఆదేశించారు. అంతేకాదు.. జైళ్ల శాఖలో భారీగా బదిలీలు చేపట్టనున్నట్లు ప్రకటించారు. భద్రతా లోపాలకు కారణమైన ఇతర అధికారులపై కఠిన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు.

రాష్ట్రంలో క్షీణిస్తున్న శాంతిభద్రతలు: స్టాలిన్

ఈ ఘటన నేపథ్యంలో డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ స్పందిస్తూ టీవీకే ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయని మండిపడ్డారు. చెన్నైలోని ప్రముఖ ప్రాంతాలలో జరుగుతున్న హత్యలు, పిల్లలపై లైంగిక హింస, జైలు నుంచి ఖైదీలు పారిపోవడం వంటి ఘటనలే ఇందుకు ఉదాహరణలని దుయ్యబట్టారు. శాంతిభద్రతల పరిస్థితి, పెరుగుతున్న ధరలకు నిరసనగా అక్టోబర్ 31న రాష్ట్రవ్యాప్తంగా తమ పార్టీ మహిళా విభాగం నిరసన చేపట్టనున్నట్లు ప్రకటించారు. విజయ్ హీరోయిజం సినిమాల్లోలాగానే నిజజీవితంలోనూ కనిపిస్తుందనే ఆశతో ప్రజలు ఆయనకు ఓటు వేశారని అన్నారు. కానీ ప్రస్తుత పరిస్థితులు చూసి వారు నిరాశ చెందుతున్నారని విమర్శించారు.

అక్టోబరు 26న రాత్రి జైలు సిబ్బందిపై దాడి చేసి.. 17 మంది ఖైదీలు తప్పించుకున్న సంగతి తెలిసిందే (జీఓఎస్ఎంఎన్). దీంతో పోలీసులు 20కి పైగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పారిపోయిన వారందరినీ పట్టుకున్నారు. ప్రస్తుతం వారందరినీ రాష్ట్రంలోని అత్యంత భద్రత కలిగిన కేంద్ర కారాగారాలకు తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ ఘటన నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని జైళ్లలో సెక్యూరిటీని కట్టుదిట్టం చేశారు.

రెస్క్యూ మిషన్ విఫలం..

భూమిపై కూలిపోనున్న టెలిస్కోప్

బ్రాడ్ సెంకో తెలిపారు. స్విఫ్ట్ అబ్జర్వేటరీ 2004 నవంబర్ 20న అంతరిక్షంలోకి దూసుకెళ్లింది. విశ్వంలో అత్యంత శక్తిమంతమైన విస్ఫోటనాలైన గామా రే బరస్ట్స్, సూపర్‌నోవాల అన్వేషణకు దీన్ని ప్రయోగించారు. దీన్ని రెస్క్యూ చేసే బాధ్యతను 'కాటలిస్ట్ స్పేస్'కు నాసా అప్పగించింది. ఈ ఏడాది జులైలో ఆ సంస్థ ప్రయోగించిన 'లింక్' అనే మూడు చేతుల రోబో ప్రయోగం విఫలమై.. సెప్టెంబర్‌లో భూమిపై కూలిపోయింది. ఈ క్రమంలోనే అక్టోబర్ నాటికి పరిస్థితి మరింత దిగజారడంతో టెలిస్కోప్‌లోని వ్యవస్థలను నిలిపివేశారు. 'స్విఫ్ట్ అబ్జర్వేటరీ' తన జీవితకాలంలో 2,000కుపైగా గామా రే బరస్ట్స్, 1,400 సూపర్‌నోవాలు, అనేక తోకచుక్కలు, గ్రహశకలాలను, బ్లాక్ హోల్స్‌ను పరిశీలించింది. ఖగోళంలో ఎక్కడైనా విస్ఫోటనాలు జరుగుతున్నప్పుడు ఆ దిశగా అత్యంత వేగంగా (గ్రాఅట్శ్రీఎ)కదిలి దాన్ని కవర్ చేయడం ఈ టెలిస్కోప్ ప్రత్యేకత. అందుకే దీనికి 'స్విఫ్ట్' అనే పేరు పెట్టారు.

జగన్ అక్రమాస్తుల కేసుల

విచారణలో పెరిగిన వేగం

విజయసాయిరెడ్డి, బీపీ ఆచార్య, అయోధ్యరామిరెడ్డి, ధర్మాన ప్రసాదరావు, మోపిదేవి వెంకటరమణ, నిమ్మగడ్డ ప్రసాద్ తదితరుల డిశ్చార్జి పిటిషన్లపై ఇరు వైపులా వాదనలు ముగిశాయి. వీటన్నింటిపై ఒకేసారి సీబీఐ కోర్టు ఆదేశాలు వెలువరించనుంది.

సాయినగర్‌లో చంద్రశేఖర్ దంపతుల ప్రచార హోరు!

మహిళల ఆశీస్సులతో కూటమి విజయమే లక్ష్యం



సోమందేపల్లి, అక్టోబర్ 31 (సిటిజన్ టైమ్స్)

సోమందేపల్లి పట్టణంలోని సాయినగర్‌లో కూటమి ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. ఎంపీపీ అభ్యర్థి నీరుగంటి చంద్రశేఖర్ తన ధర్మపత్ని శ్రీమతి అనురాధతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి ఆశీస్సులు, మద్దతు కోరారు. కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా మహిళా శక్తిని కూడగడుతూ అనురాధ ప్రచారంలో చురుకుగా పాల్గొన్నారు. ప్రజల మద్దతుతో ఎన్నికల్లో విజయం సాధించి అభివృద్ధికి కృషి చేస్తామని చంద్రశేఖర్ దంపతులు ప్రజలను కోరారు.

బొంతపల్లిలో దుర్గమ్మ బోనాల పండుగకు ఘనంగా ఏర్పాట్లు



గుమ్మడిదల సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 31

బోనాల పండుగకు రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్‌కు ఆహ్వానం

గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి గ్రామంలో మూడు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే దుర్గమ్మ బోనాల పండుగను నవంబర్ 1వ తేదీ ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు శంకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి అశోక్ గౌడ్‌లు బోనాల పండుగకు హాజరుకావాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్‌లను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీచూర్ణం చక్రపాణి, నాయకులు చప్పటి మహేష్, మంద భాస్కర్ రెడ్డి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

5

బ్రాహ్మణపల్లిలో కూటమి ప్రచార హోరు.. జయంతి, సిద్దలింగప్ప, శ్రీనివాసరెడ్డి విస్తృత ప్రచారంలి

పనిచేసే వారిని గుర్తించండి.. అభివృద్ధిని పరిశీలించి ఓటు వేయండి



సోమందేపల్లి అక్టోబర్:31 టసిటిజన్ టైమ్స్

సోమందేపల్లి మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో కూటమి నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ అభ్యర్థులకు మద్దతుగా గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రజలు అభ్యర్థుల పనితీరు, గతంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో జయంతి, సిద్దలింగప్ప, శ్రీనివాసరెడ్డి, చల్లపల్లి రామకృష్ణ, భాను, నాగేష్, మూర్తి, ఇర్ఫాన్, షఫీ, గంగాధర్, అనసూయ, నగరత్నమ్మ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుర్రంకొండ జడ్పిటిసీ టిడిపి అభ్యర్థి ప్రచార జోరు

గుర్రంకొండ అక్టోబర్ 31సిటిజన్ టైమ్స్

అన్నమయ్య జిల్లా గురంకొండ మండలం జడ్పిటిసీ టిడిపి అభ్యర్థి మండలంలోని తరిగొండ లో ప్రచార జోరు కొనసాగించారు. ప్రతి ఇంటివద్దకు వెళ్లి కూటమి ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరుస్తూ, మన ప్రభుత్వ పాలనలో అభివృద్ధి వేగవంతంగా కొనసాగుతోందని ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేరుస్తుందని తన సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే గుర్రంకొండ మండలం అభివృద్ధికి పాటుపడతానని అన్నివేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని ప్రజలకు హామీ ఇస్తూ ఓటు అడుగుతూ ప్రచారం కొనసాగిస్తున్నారు. ఇతనివెంట తరిగొండ టిడిపి నాయకులు అభిమానులు ఉన్నారు.



సింహాచలం క్షేత్ర భూములపై ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణమే రద్దు చేయాలి!

ధార్మిక ప్రయోజనాల కోసం కేటాయించిన భూములను ఇతర అవసరాలకు వినియోగించడంపై అభ్యంతరం

స్వరూపానందేంద్ర సరస్వతీ స్వామీజీ లేని లోటు కనిపిస్తోంది -తెలుగు శక్తి అధినేత బి.వి.రామ్

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 31:

సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి వారి పవిత్ర క్షేత్రానికి సంబంధించిన భూముల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే పునఃసమీక్షించి రద్దు చేయాలని తెలుగుశక్తి అధినేత బి.వి.రామ్ డిమాండ్ చేశారు. ఆలయ భూములు కేవలం ఆస్తులు మాత్రమే కావని, అవి కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి, హిందూ ధర్మ సంప్రదాయాలకు ప్రతీకలని పేర్కొన్నారు. ధార్మిక ప్రయోజనాల కోసం ఉద్దేశించిన భూముల విషయంలో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

రాజశ్యామల అమ్మవారిని దర్శించుకుని వ్యాఖ్యలు

శనివారం విశాఖపట్నం జిల్లా పెందుర్తి చిన్న ముషిడివాడ లోని విశాఖ శ్రీ శారదా పీఠంలో రాజశ్యామల అమ్మవారిని దర్శించుకున్న అనంతరం బి.వి.రామ్ విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సింహాచలం క్షేత్ర భూముల వ్యవహారంపై తన అభ్యంతరాలను వ్యక్తం చేశారు. సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వారి క్షేత్ర పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు.

వేద పాఠశాల నిర్మాణానికి కేటాయించిన భూముల పరిస్థితి ఏమిటి?

గతంలో స్వరూపానందేంద్ర సరస్వతీ స్వామీజీ సింహాచలం క్షేత్ర అభివృద్ధి, హిందూ ధర్మ పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేశారని బి.వి.రామ్ గుర్తుచేశారు. సుమారు 15 ఎకరాల భూమిని వేద పాఠశాల నిర్మాణం, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సేవా కార్యక్రమాల నిర్వహణ వంటి ధార్మిక ప్రయోజనాల కోసం వినియోగించాలనే ఉద్దేశంతో కేటాయించిన విషయాన్ని ప్రస్తావించారు. అలాంటి భూముల విషయంలో ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తీవ్ర ఆక్షేపణీయమని పేర్కొన్నారు.

రామదేవ్ బాబా పేరుతో కేటాయింపు..
రిసార్ట్‌కు అప్పగించారనే ఆరోపణలు

రామదేవ్ బాబాకు భూములు కేటాయించినట్లు భావించినప్పటికీ, చివరకు ఒక రిసార్ట్‌కు భూములు అప్పగించినట్లు ఆరోపణలు వస్తున్నాయని బి.వి.రామ్ పేర్కొన్నారు. ఈ పరిణామాలు భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భూముల కేటాయింపు వెనుక ఉన్న వాస్తవాలను ప్రభుత్వం ప్రజలకు వెల్లడించాలని, వాటి వినియోగంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.



స్వరూపానందేంద్ర స్వామీజీ మార్గదర్శకత్వం లోటు

సింహాచలం క్షేత్ర అభివృద్ధి, హిందూ ధర్మ పరిరక్షణ విషయంలో స్వరూపానందేంద్ర సరస్వతీ స్వామీజీ చేసిన కృషి మరువలేనిదని బి.వి.రామ్ అన్నారు. ఇటువంటి ధార్మిక అంశాల్లో ఆయన మార్గదర్శకత్వం ప్రస్తుతం లేకపోవడం లోటుగా కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంలో స్వామీజీ గతంలో చూపిన ధార్మిక దృక్పథాన్ని పరిగణనలోకి తీసుకుని నిర్ణయాలను పునఃసమీక్షించాలని కోరారు.

ఆలయ భూముల పరిరక్షణ ప్రభుత్వ బాధ్యత

ధర్మాన్ని మనం కాపాడితే ఆ ధర్మమే మనల్ని కాపాడుతుందనే సత్యాన్ని పాలకులు గుర్తించాలని బి.వి.రామ్ హితవు పలికారు. దేవాలయాలకు సంబంధించిన భూములు, ఆస్తులు ధార్మిక ప్రయోజనాలకే ఉపయోగపడేలా చూడాలని అన్నారు. సింహాచలం క్షేత్రానికి ఉన్న చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యతను గుర్తించి, భక్తుల విశ్వాసాలకు భంగం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు.



ధర్మ పరిరక్షణ కోసం ప్రజాస్వామ్య ఉద్యమం

ఈ అంశాన్ని తాము రాజకీయ కోణంలో చూడటం లేదని, ఒక హిందువుగా హిందూ ధర్మ పరిరక్షణ బాధ్యతతోనే స్పందిస్తున్నామని బి.వి. రామ్ స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రజలందరూ తమ సంస్కృతి, సంప్రదాయాలు, ధార్మిక క్షేత్రాల పరిరక్షణకు బాధ్యతగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సింహాచలం క్షేత్రానికి సంబంధించిన భూముల కేటాయింపుపై తీసుకున్న నిర్ణయాన్ని పునఃసమీక్షించి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ధర్మ పరిరక్షణ కోసం ప్రజలను కలుపుకుని ప్రజాస్వామ్యబద్ధంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని తెలుగు శక్తి అధినేత బి.వి.రామ్ హెచ్చరించారు.

తుఫాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి

పంటల రక్షణకు ముందస్తు చర్యలు చేపట్టాలి

క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉండాలి.. అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం

అమరావతి, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 31



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుఫానుగా మారే అవకాశం ఉన్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం నవంబర్ 2వ తేదీ సాయంత్రానికి తుఫాను ఆంధ్రప్రదేశ్ తీరానికి సమీపించే అవకాశం ఉందని, నవంబర్ 2, 3 తేదీల్లో కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా కృష్ణా, గుంటూరు, బాపట్ల, ఎన్టీఆర్, పల్నాడు, ఏలూరు, పశ్చిమ గోదావరి, ప్రకాశం, నెల్లూరు జిల్లాల రైతులు మరింత జాగ్రత్తగా ఉండాలని కోరారు. వరి, పత్తి, మిర్చి, ఉద్యాన పంటల పొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా మురుగునీటి కాలువలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. కోతలు పూర్తయిన పంట ఉత్పత్తులను సురక్షిత ప్రాంతాలకు తరలించి వర్షానికి తడవకుండా కాపాడుకోవాలన్నారు. వాతావరణం సాధారణ స్థితికి వచ్చే వరకు పంట కోతలు, పురుగుమందుల పిచికారీ, ఎరువుల వినియోగాన్ని వాయిదా వేసుకోవాలని సూచించారు. బలమైన గాలులు, పిడుగులు పడే సమయంలో రైతులు పొలాల్లోకి వెళ్లకూడదని, పశువులను సురక్షిత ప్రాంతాల్లో ఉంచాలని కోరారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లకుండా వాతావరణ శాఖ హెచ్చరికలను పాటించాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక, మత్స్యశాఖల అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా గ్రామస్థాయిలో రైతులకు అందుబాటులో ఉండాలని మంత్రి ఆదేశించారు. పంటల సంరక్షణపై అవగాహన కల్పించడంతో పాటు వ్యవసాయ శాస్త్రవేత్తల సహకారంతో నష్ట నివారణకు అవసరమైన సాంకేతిక సూచనలు అందించాలని తెలిపారు. అవసరమైన విత్తనాలు, ఇతర వ్యవసాయ ఉత్పాదకాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. వర్షాల కారణంగా రైతులకు ఎదురయ్యే సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించాలని, క్షేత్రస్థాయి పరిస్థితులను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేయాలని పేర్కొన్నారు. ఇటీవల తుఫాను ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులు మరోసారి వర్షాల హెచ్చరికల నేపథ్యంలో అధైర్యపడవద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణకు అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని, వాతావరణ శాఖ, విపత్తుల నిర్వహణ సంస్థ జారీ చేసే తాజా హెచ్చరికలను రైతులకు చేరవేయాలని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

పోలీసు అమరవీరులకు ఘన నివాళులు.. కొవ్వొత్తుల ర్యాలీ

జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఆధ్వర్యంలో పోలీసు శాఖ, ప్రజల భాగస్వామ్యం

అమలాపురం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 31:

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఆధ్వర్యంలో శుక్రవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పోలీసు సాయుధ రిజర్వు కార్యాలయం నుంచి గడియార స్తంభం వరకు పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజలు కలిసి ర్యాలీ చేపట్టి అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో దేశం కోసం, ప్రజల రక్షణ కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. వారి త్యాగాలను స్మరించుకోవడంతో పాటు అమరవీరుల కుటుంబాలకు అండగా ఉన్నామనే భరోసా కల్పించడమే సంస్మరణ వారోత్సవాల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అమరవీరుల కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ మహేంద్ర మత్తే, అమలాపురం ఉపవిభాగ



పోలీసు అధికారి టి.ఎస్.ఆర్.కె. ప్రసాద్, ఏఆర్ డీఎస్పీ జి.యు.కె.ఎల్.వి. సుబ్బరాజు, ఎస్‌బీ సీఐ వి. పుల్లారావు, ఆర్ఐ ఎన్. బ్రహ్మానందం, ఆర్ఎస్ఐలు, జిల్లా పోలీసు కార్యాలయ అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

సీసీ హరి నాయకత్వంలో గాంధీనగర్‌లో ఎన్నికల సందడి!

కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఇంటింటా ప్రచారం




సోమందేపల్లి, అక్టోబర్ 31 (సిటిజన్ టైమ్స్):

సోమందేపల్లి పట్టణంలోని గాంధీనగర్‌లో కూటమి ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ఎంపీటీసీ అభ్యర్థి సాయి లీలా లవ్లీకి మద్దతుగా టీడీపీ నాయకుడు సీసీ హరి పిలుపు మేరకు కూటమి నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటినీ సందర్శిస్తూ స్థానిక ఓటర్లను ఆప్యాయంగా పలకరించి, అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా సీసీ హరి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. మంత్రి సవితమ్మ నాయకత్వంపై తమకు పూర్తి విశ్వాసం ఉందని పేర్కొంటూ, ఆమె ఆశయాలకు అనుగుణంగా సోమందేపల్లి మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. గాంధీనగర్‌లో నిర్వహించిన ఈ ఇంటింటి ప్రచారంలో కూటమి నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని స్థానికులతో మమేకమయ్యారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అభివృద్ధి చూసి ఓటేయ్యండి

గుర్రంకొండ అక్టోబర్ 31సిటిజన్ టైమ్స్

కూటమి ప్రభుత్వం లో ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, పలు అభివృద్ధి కార్యక్రమాలు చూసి తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను సైకిల్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని గుర్రంకొండ జడ్పిటిసి అభ్యర్థి ఎజాజ్ అహమ్మద్ మరియు ఎంపిటిసి 1,2,అభర్తులు ప్రజలను కోరుచున్నారు. తమని గెలిపిస్తే గుర్రంకొండ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేబడతామని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి అంకిత భావంతో ప్రజా సేవ చేస్తామని ఓటర్లకు విన్నవిస్తూ ప్రచారం చేస్తున్నారు.హరిజనవాడ కొత్తపేట, దౌలత్ ఖాన్ పల్లి పలుచోట్ల ప్రచారం చేశారు. ఈ ప్రచారం లో మండల టిడిపి అధ్యక్షుడు నాయని జగదీష్, టీడీపీ నాయకులు రంజిత్ కుమార్, ఇనుగొండ రామయ్య, తిరువీధి శబరీష్, మౌలా, బీజేపీ మండల నాయకుడు కె. రామాంజులు ఇతర కూటమి నాయకులు పాల్గొన్నారు.



ముగ్గురూ కలిస్తే ఫలితం ఏకపక్షమే: గంటా

ఆనందపురం, సిటిజెన్ టైమ్స్ అక్టోబర్ 31:

కూటమి పార్టీలు మూడు కలిస్తే అజేయ శక్తిగా ఏకపక్ష ఫలితాలు సాధిస్తాయని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. గిడిజాలలోని రిసార్ట్స్ లో శనివారం నిర్వహించిన ఆనందపురం జెడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంట శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమిగా అసెంబ్లీ ఎన్నికల్లో కనీవినీ ఎరుగని రీతిలో 94% స్ట్రైక్ రేట్ సాధించామని, స్థానిక ఎన్నికల్లో అంతకంటే ఎక్కువ మెజారిటీ వస్తేనే 28 నెలల పాటు చేసిన అభివృద్ధికి, అమలు చేసిన సంక్షేమానికి గుర్తింపు దక్కినట్టని పేర్కొన్నారు. మండలంలోని జడ్పీటీసీ సహా 17 ఎంపీటీసీలను గెలుచుకుని కూటమి బలాన్ని చాటాలన్నారు. పొత్తుల కారణంగా ఆఖరి నిముషం వరకూ తుది జాబితా ఖరారు చేసుకోలేని కారణంగా కొంత జాప్యం జరిగినా మూడు పార్టీలకు ఆమోదయోగ్యమైన సర్దుబాటు చేసుకున్నామని చెప్పారు. పొత్తు కారణంగా టికెట్లు దక్కని ఆశావహులకు భవిష్యత్ లో పదవులిచ్చి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. పంచాయతీ ఎన్నికల్లో కొంతమందికి, నామినేటెడ్ పోస్టుల్లో మరికొంతమందికి అవకాశం కల్పిస్తామన్నారు. కూటమి అభ్యర్థి విజయం కోసం పని చేయని వారిని పార్టీల నుంచి సస్పెండ్ చేస్తామని, క్రమశిక్షణ లేని అలాంటి వారిని భవిష్యత్ లో ఎప్పుడూ కూటమి పార్టీల్లోకి చేర్చుకోవడం జరగదని స్పష్టం చేశారు. రెబల్స్ గా పోటీ చేస్తున్న రాష్ట్రంలోని కీలకమైన 15 మంది నాయకులను ఇప్పటికే సీఎం చంద్రబాబు పార్టీ నుంచి బహిష్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. భీమిలి నియోజకవర్గంలో కార్పొరేటర్, ఎంపీటీసీ రెబెల్స్ ఎవరూ పోటీలో లేరని, ఐకమత్యంతో అన్ని స్థానాలను



గెలిచి తీరుతామన్నారు. ఎన్నికల్లో వైసీపీ ఆగడాలు సహించేది లేదని చెబుతూ.. కూటమి అభ్యర్థులకు సహకారం అందించడానికి భీమిలిలో వార్ రూమ్ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. దేశానికి పీఎం, రాష్ట్రానికి సీఎం, అసెంబ్లీకి ఎమ్మెల్యే లా స్థానికంగా ఎంపీటీసీ, సర్పంచులు సమాజంలో కీలక పాత్ర వహిస్తారన్నారు. స్థానికంగా కూడా కూటమి అభ్యర్థులే గెలిస్తే అభివృద్ధి కొనసాగుతుందని చెప్పారు. పెన్షన్లు, తల్లికి వందనం పథకాల అమలులో ప్రజల్ని జగన్మోహన్ రెడ్డి మోసం చేశారని ధ్వజమెత్తారు. మహారాష్ట్ర, తమిళనాడు, గుజరాత్ వంటి ధనిక రాష్ట్రాలు ఇంత పెద్ద మొత్తంలో పెన్షన్లు ఇవ్వడం లేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో చెప్పినట్టు మహిళలకు ఉచిత బస్సు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ల్యాండ్ టైటలింగ్ యాక్టు రద్దు, మెగా డీఎస్సీ వంటి హామీలన్నీ నెరవేర్చామని వివరించారు.

అభివృద్ధిలో భాగస్వాములవ్వండి: షరీఫ్

విశ్వ నగరంగా రూపు దిద్దుకుంటున్న చెందుతున్న విశాఖ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు, ఎన్నికల పరిశీలకుడు ఎం.ఎ.షరీఫ్ కూటమి తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులకు పిలుపునిచ్చారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల నుంచి జెడ్పీటీసీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న ముగ్గురు, ఆనందపురం మండలంలో కూటమి పోటీ చేస్తున్న 17 మంది ఎంపీటీసీ అభ్యర్థులతో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్న కూటమికి స్థానిక ఎన్నికల్లో ఘన విజయాన్ని అందించి ఆశీర్వదించాలని కోరారు. రాజకీయాన్ని కూడా ఫ్యాక్షనిజంగా మార్చిన జగన్మోహన్ రెడ్డికి ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని దుర్వినియోగం చేసుకున్నారని విమర్శించారు. స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి ప్రజలకు చేరువ కావాలని సూచించారు. 2029 లో కూటమి మరింత బలోపేతం కావడానికి స్థానిక సంస్థల ఫలితాలు ఉపయోగపడతాయని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ ఇంచార్జ్ చిక్కాల విజయ్ బాబు, జనసేన ఇంచార్జ్ పంచకర్ల సందీప్, బీజేపీ ఇంచార్జ్ జీరు కైలాష్ రెడ్డి, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు తాట్రాజు అప్పారావు, జెడ్పీటీసీ అభ్యర్థి ఎన్ని శ్రీనివాసరావు, ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సామగ్రి పంపిణీపై కలెక్టర్ క్షేత్రస్థాయి తనిఖీలు

పోలింగ్ సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలి



విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 31

గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లా యంత్రాంగం చేపట్టిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గోపాలపట్నం జెడ్పీ ఉన్నత పాఠశాల, నాయుడుతోటలోని భాష్యం పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను తనిఖీ చేశారు. పోలింగ్ సిబ్బందికి అవసరమైన ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ పత్రాలు, ఎన్నికల రికార్డులు, ఇతర పత్రాల పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వారీగా సామగ్రిని సరిచూసుకుని ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల విధులకు హాజరైన సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రతి సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు సకాలంలో చేరుకుని, విధులకు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

మజ్జివలసలో టీడీపీ ఎంపిటీసి అభ్యర్థి ప్రచార జోరు



భీమిలి రూరల్ సిటిజెన్ టైమ్స్ అక్టోబర్ 31:

మజ్జివలస ఎంపీటీసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మజ్జివలస గ్రామంలో ఎంపీటీసీ అభ్యర్థిని కనకల అచ్చియ్యమ్మకు మరియు జడ్పిటిసి అభ్యర్థిని గాడు అలివేణి ప్రచారం జోరు అందుకుంది. ఈ ఎంపీటీసీ జడ్పిటిసి అభ్యర్థులకు మద్దతుగా ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించిన మజ్జివలస, లక్ష్మీపురం తెలుగుదేశం పార్టీ కూటమి నాయకులు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి.. ఘనంగా జాతీయ సమైక్యతా దినోత్సవం

అనకాపల్లి పోలీసుల ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ, రెండు కిలోమీటర్ల ఐక్యతా పరుగు, కొవ్వొత్తుల ర్యాలీ



అనకాపల్లి, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 31:

అఖండ భారత నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని అనకాపల్లి జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు కైలాసగిరిలోని సాయుధ రిజర్వు పోలీసు కార్యాలయంలో పటేల్ విగ్రహానికి ఆర్ఐ ఎం. మనోహర్, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పోలీసు సిబ్బందితో జాతీయ సమైక్యతా ప్రతిజ్ఞ చేయించారు. తర్వాత కార్యాలయం నుంచి జోడుగుళ్లపాలెం మీదుగా రెండు కిలోమీటర్ల ఐక్యతా పరుగు నిర్వహించారు. విశాలాక్షి కూడలి వద్ద కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టి దేశ ఐక్యతను చాటారు. ఈ సందర్భంగా ఆర్ఐ ఎం. మనోహర్ మాట్లాడుతూ వందలాది సంస్థానాలను ఏకం చేసి అఖండ భారత నిర్మాణానికి పునాది వేసిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని కొనియాడారు. భిన్నత్వంలో ఏకత్వమే భారతదేశ బలమని, యువత ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని దేశ సమగ్రత, ఐక్యత పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఐలు అనిల్ రాజ్, గంగాధర్, రాజుబాబు, సాయుధ రిజర్వు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్, ఓట్ల లెక్కింపులో పారదర్శకతకు పెద్దపీట వేయాలి

విధుల్లో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

పోలింగ్, ఓట్ల లెక్కింపు విధానాలపై అధికారులకు దిశానిర్దేశం చేసిన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 31

గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ రెండో సాధారణ ఎన్నికల్లో పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియలను ఎన్నికల నియమ నిబంధనలకు అనుగుణంగా పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని జీవీఎంసీ కమిషనర్, అదనపు ఎన్నికల అధికారి కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉత్తర ప్రాంగణంలో జీవీఎంసీ, వీఎంఆర్డీఏ ఉన్నతాధికారులు, జోనల్ కమిషనర్లు, ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక తదితర విభాగాల అధికారులకు పోలింగ్, ఓట్ల లెక్కింపు విధానాలపై శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల విధుల్లో చేపట్టాల్సిన చర్యలు, పాటించాల్సిన నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను కమిషనర్ వివరించారు. నవంబర్ 1వ తేదీన జీవీఎంసీ పరిధిలోని పది జోన్లలో 120 వార్డులకు పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ప్రతి అధికారి, సిబ్బంది తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. పోలింగ్ ప్రారంభానికి ముందే కేంద్రాల్లో ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ పత్రాలు, పెట్టెలు, ఇతర ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. మేయర్ ఎన్నికకు పింక్ రంగు బ్యాలెట్ పత్రం, వార్డు సభ్యుల ఎన్నికకు తెలుపు రంగు బ్యాలెట్ పత్రం వినియోగిస్తున్నందున ఓటర్లు ఓటు వేసే విధానంపై స్పష్టమైన అవగాహన కల్పించాలని తెలిపారు. వృద్ధులు, దివ్యాంగ ఓటర్లకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు.

ఓట్ల లెక్కింపులో అప్రమత్తత అవసరం

ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ప్రతి దశను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నిర్వహించాలని కమిషనర్ ఆదేశించారు. బ్యాలెట్ పెట్టెల స్వీకరణ, భద్రత, ముద్రల పరిశీలన, బ్యాలెట్ పత్రాల క్రమబద్ధీకరణ, ఓట్ల



లెక్కింపు వంటి ప్రక్రియల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి విడత ఓట్ల లెక్కింపు వివరాలను సక్రమంగా నమోదు చేసి, ధ్రువీకరించిన అనంతరమే తదుపరి ప్రక్రియ చేపట్టాలని స్పష్టం చేశారు. లెక్కింపు కేంద్రాల్లో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని, అభ్యర్థుల ప్రతినిధుల సందేహాలు, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం పరిష్కరించాలని సూచించారు. ఫలితాల ప్రకటన వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జీవీఎంసీ, వీఎంఆర్డీఏ, పోలీసు, ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక తదితర విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, పోలింగ్, లెక్కింపు కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం, భద్రతతో పాటు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి అధికారి, సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, జీవీఎంసీ ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పూర్తి పారదర్శకతతో నిర్వహించేందుకు సమష్టిగా కృషి చేయాలని కమిషనర్ కేతన్ గార్గ్ సూచించారు.

తాళ్లవలస లో టిడిపి ఎంపీటీసీ అభ్యర్థి ఈశ్వర్ కుమార్ ఇంటింటి ప్రచారం



భీమిలి సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 31:

స్థానిక ఎంపీటీసీ ఎలక్షన్లో భాగంగా భీమిలి మండలం తాలవలస పంచాయతీ ఎంపీటీసీ అభ్యర్థి ఈశ్వర్ కుమార్ ఇంటింటి ప్రచారం జోరు అందుకుంది. ఇందులో భాగంగా కూటమి నాయకులు పాల్గొన్నారు.

జీవీఎంసీ ఎన్నికల్లో ప్రతి పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలను అమలు చేయాలి.. కలెక్టర్, కమిషనర్‌కు కె.కె. రాజు వినతి

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 31:



జీవీఎంసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, వీడియోగ్రఫీ ఏర్పాట్లు తప్పనిసరిగా పూర్తి చేయాలని జిల్లా పార్టీ అధ్యక్షుడు కె.కె. రాజు జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు శనివారం అధికారులకు వినతిపత్రం సమర్పించారు. సర్వోన్నత న్యాయస్థానం అక్టోబర్ 27న జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం నామినేషన్ల స్వీకరణ కేంద్రాలు, రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలు, పోలింగ్ కేంద్రాలు, భద్రతా గదులు, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో సీసీ కెమెరాలు, వీడియోగ్రఫీ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఎన్నికల పిటిషన్ల పరిష్కారం పూర్తయ్యే వరకు సంబంధిత దృశ్యాలను భద్రపరచాలని కూడా ఆదేశించినట్లు తెలిపారు. జీవీఎంసీ పరిధిలోని కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఇప్పటికీ సీసీ కెమెరాలు, వీడియోగ్రఫీ ఏర్పాట్లు పూర్తిస్థాయిలో జరగలేదని సమాచారం వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో నామినేషన్ల సమయంలో చోటుచేసుకున్న ఘటనల నేపథ్యంలో పోలింగ్‌లో అక్రమాలు, దొంగ ఓట్లు, బూత్‌ల ఆక్రమణ, ఓటర్లను భయపెట్టడం వంటి ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో పోలింగ్ ప్రారంభానికి ముందే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ప్రవేశ ద్వారాలు, బ్యాలెట్ పెట్టెలు ఉండే ప్రాంతాలు నిరంతరం కెమెరాల పర్యవేక్షణలో ఉండాలని సూచించారు. సమస్యాత్మక కేంద్రాల్లో ప్రత్యక్ష చిత్రీకరణ ఏర్పాటు చేయాలని, పోలింగ్ అనంతరం బ్యాలెట్ పెట్టెలకు ముద్రలు వేయడం, వాటిని తరలించే ప్రక్రియను కూడా చిత్రీకరించాలని కోరారు. భద్రతా గదుల్లో బ్యాలెట్ పెట్టెలు భద్రపరిచినప్పటి నుంచి ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు నిరంతర పర్యవేక్షణ ఉండాలని, అభ్యర్థులు, వారి ప్రతినిధులకు నిబంధనల ప్రకారం భద్రతను పరిశీలించే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. నవంబర్ 3న జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియలోనూ పూర్తి స్థాయి వీడియోగ్రఫీ, సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండాలని, ఎన్నికలకు సంబంధించిన దృశ్యాలను న్యాయస్థానం సూచించిన గడువు వరకు భద్రపరచాలని కోరారు. ప్రజాస్వామ్య విలువలు, ఓటర్ల స్వేచ్ఛ, ఎన్నికల పారదర్శకతను కాపాడేందుకు కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్ ఈ అంశాన్ని అత్యవసరంగా పరిగణించి తక్షణ చర్యలు తీసుకోవాలని కె.కె. రాజు విజ్ఞప్తి చేశారు.

మేయర్, వార్డు సభ్యుడికి రెండు ఓట్లు తప్పనిసరి

పింక్, తెలుపు రంగు బ్యాలెట్ పత్రాలతో ఓటింగ్.. రెండూ ఒకే పెట్టెలో వేయాలి

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 31

గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ రెండో సాధారణ ఎన్నికల పోలింగ్ నవంబర్ 1వ తేదీ ఆదివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్, ఎన్నికల అథారిటీ ఎం. అభిషిక్త్ కిశోర్ తెలిపారు. పోలింగ్ సమయం, ఓటింగ్ విధానంపై ఓటర్లకు స్పష్టతనిస్తూ శనివారం ప్రకటన విడుదల చేశారు. ప్రతి ఓటరూ మేయర్ అభ్యర్థికి, తమ వార్డు సభ్యుడి అభ్యర్థికి ఒక్కొక్క ఓటు చొప్పున మొత్తం రెండు ఓట్లు వేయాల్సి ఉంటుందన్నారు. మేయర్ అభ్యర్థికి పింక్ రంగు బ్యాలెట్ పత్రం, వార్డు సభ్యుడి అభ్యర్థికి తెలుపు రంగు బ్యాలెట్ పత్రం ఉంటాయని వివరించారు. ఓటర్లు రెండు బ్యాలెట్ పత్రాలపై తమకు నచ్చిన అభ్యర్థి గుర్తుకు ఎదురుగా నిబంధనల ప్రకారం ముద్ర వేయాలని సూచించారు. అనంతరం పింక్, తెలుపు రంగుల రెండు బ్యాలెట్ పత్రాలనూ ఒకే బ్యాలెట్ పెట్టెలో వేయాలని, వేర్వేరు పెట్టెల్లో వేయకూడదని స్పష్టం చేశారు. ఈ విషయంపై పోలింగ్ అధికారులు కూడా ఓటర్లకు అవగాహన కల్పించాలని ఆదేశించినట్లు తెలిపారు. ఇప్పటికే అన్ని పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది అవసరమైన సామగ్రితో చేరుకున్నారని, ఓటర్లు స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పటిష్ట ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ వెల్లడించారు. అర్హులైన ఓటర్లందరూ నిర్ణీత సమయంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రశాంతంగా, పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు సహకరించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.



ఆర్నబ్ తుపాను నష్టాలపై కేంద్ర బృందం క్షేత్రస్థాయి పరిశీలన

బాధిత రైతులు, మత్స్యకారులకు ఆర్థిక సాయం అందించాలని కలెక్టర్ విజ్ఞప్తి





అమలాపురం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 31:

అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఆర్నబ్ తుపాను కారణంగా జరిగిన నష్టాలను అంచనా వేసేందుకు కేంద్ర బృందం శనివారం జిల్లాలో పర్యటించింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి చిత్తరంజన్ దాష్ నేతృత్వంలోని బృందం రావులపాలెం, గంగలకుర్రు, వాకలగరువు, అంతర్వేదిపాలెం, సఖినేటిపల్లి ప్రాంతాల్లో పర్యటించి దెబ్బతిన్న వరి, కొబ్బరి, అరటి పంటలు, నివాస గృహాలు, మత్స్యకార బోట్లు, విద్యుత్ వ్యవస్థను పరిశీలించింది. రావులపాలెంలో జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన ప్రజెంటేషన్, ఛాయాచిత్ర ప్రదర్శన ద్వారా తుపాను నష్టాల వివరాలను అధికారులు కేంద్ర బృందానికి వివరించారు. అనంతరం బాధిత రైతులు, మత్స్యకారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ మాట్లాడుతూ తుపాను కారణంగా పంటలు, ఆస్తులు నష్టపోయిన రైతులు, మత్స్యకారులు, తీరప్రాంత ప్రజలకు తగిన ఆర్థిక సహాయం అందించాలని కేంద్ర బృందాన్ని కోరినట్లు తెలిపారు. నష్టాల అంచనా పారదర్శకంగా చేపడుతున్నామని, బాధితులకు అండగా నిలిచేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందని పేర్కొన్నారు. పర్యటన ముగించుకున్న కేంద్ర బృందం సాయంత్రం 5.30 గంటలకు కాకినాడ జిల్లా పర్యటనకు బయలుదేరి వెళ్లింది.

బట్నవిల్లిలో కూటమి ఎంపీటీసీ అభ్యర్థి విస్తృత ప్రచారం

సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని బులుసు వెంకట సుబ్రహ్మణ్య శర్మ విజ్ఞప్తి



అమలాపురం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 31:

అమలాపురం రూరల్ మండలం బట్నవిల్లి గ్రామంలో కూటమి ఎంపీటీసీ అభ్యర్థి బులుసు వెంకట సుబ్రహ్మణ్య శర్మ (బాబి) శనివారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ ఓటర్లను కలిసి తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని తనకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే జడ్పీటీసీ అభ్యర్థి లింగోలు పావనికి గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు, కూటమి నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా గాంధీ స్ఫూర్తితో తెలంగాణలో కాంగ్రెస్ పాలన నీలం మధు ముదిరాజ్..

పటాన్చెరు సిటిజన్ అక్టోబర్ 31

పటాన్చెరు తన పరిపాలన దక్షతతో భారత దేశ ఉక్కుమహిళగా పేరుగాంచిన వీరవనిత మాజీ ప్రధాని భారతరత్న ఇందిరాగాంధీ అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. శనివారం ఇందిరాగాంధీ వర్ధంతి పురస్కరించుకొని చిట్కుల్ లోని ఆయన నివాసంలో, దేశ ప్రజలకు ఆమె అందించిన సంక్షేమాని స్మరించుకుంటూ ఆమె చిత్రపటానికి పూలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ పేదలకు సంక్షేమం, అభివృద్ధిని దగ్గరికి చేసి భారతీయుల గుండెలో పదిలంగా నిలిచిపోయారని తెలిపారు. ఆనాడు ఆ మహానేత ముందు చూపుతో చేపట్టిన సంక్షేమ పథకాల ఫలితంగా దేశం అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. ఇందిరమ్మ పాలన స్ఫూర్తితో తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పాలన కొనసాగిస్తూ అన్ని వర్గాలకు సంక్షేమాన్ని, అభివృద్ధిని అందిస్తుందని వివరించారు.



జీవీఎంసీ ఎన్నికలకు సర్వం సిద్ధం.. 1,990 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

నవంబర్ 1న ప్రతి ఓటరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

నగర ప్రజలకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ విజ్ఞప్తి

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 31:

గ్రేటర్ విశాఖపట్నం నగరపాలక సంస్థ రెండో సాధారణ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జీవీఎంసీ కమిషనర్, అదనపు ఎన్నికల అధికారి కేతన్ గార్గ్ తెలిపారు. నవంబర్ 1వ తేదీన జరిగే ఎన్నికల్లో నగరంలోని అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఓటరు ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిళ్లకు లొంగకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు వేయాలని కమిషనర్ సూచించారు. ఓటు వేయడం హక్కు మాత్రమే కాకుండా ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు.

పది జోన్లలో ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన

జీవీఎంసీ పరిధిలోని పది జోన్లలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు కమిషనర్ స్వయంగా సందర్శించి పరిశీలించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ, పోలింగ్ సిబ్బందికి కల్పించిన సదుపాయాలు, వివిధ విభాగాల వద్ద చేపట్టిన ఏర్పాట్లను తనిఖీ చేశారు. జీవీఎంసీ పరిధిలోని 120 వార్డులకు సంబంధించి మొత్తం 1,990 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. నవంబర్ 1వ తేదీ ఆదివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పోలింగ్ సిబ్బందికి కేటాయించిన సామగ్రిని ఎలాంటి జాప్యం లేకుండా పంపిణీ చేయాలని, ప్రతి సిబ్బంది తమకు కేటాయించిన కేంద్రాలకు నిర్దేశిత సమయానికి చేరుకోవాలని ఆదేశించారు. పంపిణీ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన స్వాగత



కేంద్రం, సహాయక కేంద్రం, ప్రిసైడింగ్ అధికారులు, సూక్ష్మ పరిశీలకులు, పోలీసు, ఆహార పంపిణీ, ఎన్నికల అధికారుల విభాగాలను పరిశీలించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది, పోలీసులకు తాగునీరు, ఆహారం, ఇతర సౌకర్యాలు కల్పించాలని సూచించారు. సిబ్బందికి ఎదురయ్యే సందేహాలు, సమస్యలను వెంటనే పరిష్కరించేలా సహాయక కేంద్రాలు నిరంతరం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులు తమకు కేటాయించిన సామగ్రిని స్వీకరించి, పోలీసు బందోబస్తు మధ్య నిర్దేశించిన మార్గాల్లో పోలింగ్ కేంద్రాలకు చేరుకునేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. సిబ్బంది రవాణా కోసం వివిధ ప్రాంతాల నుంచి బస్సులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

రెండు రంగుల బ్యాలెట్ పత్రాలతో ఓటింగ్

ఓటర్లకు ఇప్పటికే ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించినట్లు కమిషనర్ తెలిపారు. మేయర్ ఎన్నికకు పింక్ రంగు బ్యాలెట్ పత్రం, వార్డు సభ్యుడి ఎన్నికకు తెలుపు రంగు బ్యాలెట్ పత్రం వినియోగించనున్నట్లు వివరించారు. రెండు బ్యాలెట్ పత్రాలపై ఓటర్లు సక్రమంగా ఓటు వేసే విధానాన్ని పోలింగ్ అధికారులు కేంద్రాల్లో తెలియజేస్తారని చెప్పారు. బ్యాలెట్ పత్రాలను మడతపెట్టి ఒకే బ్యాలెట్ పెట్టెలో వేయాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏవైనా సమస్యలు లేదా ఫిర్యాదులు ఉంటే జీవీఎంసీ టోల్‌ఫ్రీ నంబర్ 180042500009 కు ఫోన్ చేసి తెలియజేయవచ్చని తెలిపారు. అన్ని జోన్లలో సహాయక కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, ఎన్నికల నియమ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని కమిషనర్ సూచించారు. ప్రతి ఓటు ప్రజాస్వామ్యానికి బలమని, నగర ప్రజలందరూ నవంబర్ 1వ తేదీన తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు హక్కును వినియోగించుకోవాలని కేతన్ గార్గ్ విజ్ఞప్తి చేశారు.

మున్సిపల్ ఎన్నికలకు పటిష్ట పోలీసు బందోబస్తు

నర్సీపట్నం, ఎలమంచిలి, జీవీఎంసీ పరిధిలోని 9 వార్డులకు భారీ భద్రత

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు: ఎస్పీ తుహిన్ సిన్హా



అనకాపల్లి, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 31

అనకాపల్లి జిల్లా పరిధిలోని నర్సీపట్నం, ఎలమంచిలి మున్సిపాలిటీలతో పాటు జీవీఎంసీ పరిధిలోని తొమ్మిది వార్డుల్లో నవంబర్ 1న జరగనున్న ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. శనివారం నర్సీపట్నం పట్టణ పోలీస్ స్టేషన్ మైదానంలో ఎన్నికల విధులకు కేటాయించిన పోలీసు అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. అనంతరం నర్సీపట్నం బొడ్డేపల్లిలోని డాన్ బాస్కో డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ, ఓట్ల లెక్కింపు కేంద్రాలను నర్సీపట్నం ఆర్డీవో వి.వి. రమణతో కలిసి పరిశీలించారు. భద్రత, మౌలిక సదుపాయాలపై అధికారులకు సూచనలు చేశారు. ఎన్నికల నేపథ్యంలో పోలీసు చట్టం సెక్షన్ 30, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత సెక్షన్ 163 (గతంలో 144వ సెక్షన్) అమల్లో ఉంటాయని తెలిపారు.

పోలీసులకు కీలక ఆదేశాలు..: పోలీసు సిబ్బంది ఎలాంటి పక్షపాతం లేకుండా విధులు నిర్వహించాలని, సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఆదేశించారు. ఓటర్లు నిర్భయంగా ఓటు వేసేలా భద్రత కల్పించాలని, వృద్ధులు, గర్భిణులు, దివ్యాంగులకు సహకరించాలని సూచించారు. ఎన్నికల అధికారులతో సమన్వయం పాటిస్తూ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలన్నారు. అనధికార వ్యక్తులు, రాజకీయ నాయకులను పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించరాదని, నిబంధనలకు విరుద్ధంగా మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను లోపలికి తీసుకెళ్లకుండా చూడాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద గుంపులుగా చేరడం, రాజకీయ చర్చలు నిర్వహించడం వంటి చర్యలను అడ్డుకోవాలని తెలిపారు. చిన్నపాటి వివాదాలు తలెత్తినా వెంటనే స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకురావాలని, ఎన్నికల విధుల్లో అలసత్వం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ ఎ. రవికుమార్, పలువురు సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అర్నబ్ తుఫాను బాధితులకు ప్రభుత్వం అండ

7,542 మత్స్యకార కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ ప్రారంభం

మత్స్యకారేతరులు, చేతివృత్తుల వారికి బియ్యం పంపిణీ

భోగాపురం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 31:

అర్నబ్ తుఫాను ప్రభావంతో జీవనోపాధికి ఇబ్బందులు ఎదుర్కొంటున్న మత్స్యకార కుటుంబాలకు సహాయంగా జిల్లా యంత్రాంగం నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించింది. శనివారం భోగాపురం మండలం ముక్కాం గ్రామంలో అధికారులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేశారు. జిల్లా పౌర సరఫరాల అధికారి మురళీనాథ్, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు వెంకటేశ్వరరావు, భోగాపురం తహసీల్దార్ సంయుక్తంగా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తుఫాను ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం తరఫున అందిస్తున్న సహాయాన్ని వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా గుర్తించిన ప్రతి మత్స్యకార కుటుంబానికి 50 కిలోల బియ్యంతో పాటు కందిపప్పు, పామాయిల్, చక్కెర, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు ఒక్కొక్క కిలో చొప్పున నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 7,542 మత్స్యకార కుటుంబాలకు ఈ కిట్లను అందించనున్నారు. అదేవిధంగా 1,536 మంది మత్స్యకారేతరులకు, 933 మంది చేతివృత్తుల వారికి ఒక్కొక్కరికి 25 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేయనున్నారు. తుఫాను కారణంగా ఆదాయ మార్గాలు దెబ్బతిని



ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు తక్షణ ఉపశమనం కల్పించడంతో పాటు వారి ఆహార అవసరాలను తీర్చడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. జిల్లా యంత్రాంగం, పౌర సరఫరాల శాఖ, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సమన్వయంతో అర్హులైన ప్రతి ఒక్కరికీ సహాయాన్ని అందించేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. పంపిణీలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా, జాప్యం లేకుండా సరుకులు అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని అధికారులు వివరించారు.

స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలి

భారీ మెజార్టీతో గెలిపించాలి.. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పిలుపు

పి.గన్నవరం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 31:

స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మండలంలోని నరేంద్రపురం, రాజులపాలెం, ఉడిమూడి-2, బెల్లంపూడి గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. కూటమి బలపరిచిన జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న



సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు గుర్తించాలని కోరారు. గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణా నిందితుడిపై పీడీ యాక్ట్ అమలు

16.570 కిలోల గంజాయి కేసుల్లో నిందితుడి అరెస్ట్..

విశాఖ కేంద్ర కారాగారానికి తరలింపు

విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్



విజయనగరం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 31:

గంజాయి అక్రమ రవాణాకు పదేపదే పాల్పడుతున్న సిగిలి వెంకటేష్ (29)పై పీడీ యాక్ట్ అమలు చేసినట్లు విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ తెలిపారు. తెర్లాం మండలం రంగప్పవలస గ్రామానికి చెందిన నిందితుడిని అక్టోబర్ 31న విశాఖపట్నం కేంద్ర కారాగారానికి తరలించినట్లు వెల్లడించారు. నిందితుడిపై తెర్లాం, బుదరాయవలస పోలీస్ స్టేషన్ల పరిధిలో రెండు గంజాయి కేసులు నమోదయ్యాయని, ఈ కేసుల్లో మొత్తం 16.570 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నేర ప్రవృత్తిని మార్చుకోకుండా పదేపదే గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న నేపథ్యంలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పీడీ యాక్ట్ కింద నిర్బంధ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. బొబ్బిలి గ్రామీణ సీఐ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ప్రజల భద్రతకు విఘాతం కలిగించే కార్యకలాపాలపై పోలీసుల నిఘా కొనసాగుతుందని స్పష్టం చేశారు.

డి.సి ప్రదీప్ కుమార్ సేవలు ప్రశంసనీయం

-కాంగ్రెస్ నాయకులు వి.చంద్రారెడ్డి


అమీన్పూర్ సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 31

అమీన్పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని శనివారం లింగంపల్లిలోని ఎస్.ఎన్ రెడ్డి గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జీహెచ్ఎంసీ కమిషనర్ అమిత్ నారాయణ ఎమ్మెల్సీ అంజిరెడ్డి తో పాటు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు వి.చంద్రారెడ్డి పుష్పనగేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన వీడ్కోలు సభలో చంద్రారెడ్డి మాట్లాడుతూ అమీన్పూర్ సర్కిల్ అభివృద్ధిలో డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్ అందించిన సేవలు, చేసిన కృషి ప్రశంసనీయమని కొనియాడారు. ప్రభుత్వ ఉద్యోగంలో పదవీ విరమణ అనేది సహజమైన ప్రక్రియ అని, ఉద్యోగ జీవితంలో ఎన్నో బాధ్యతలు నిర్వర్తించిన ఆయన ఇకపై కుటుంబ సభ్యులతో కలిసి శేష జీవితాన్ని ఆనందంగా, ఆరోగ్యంగా గడపాలని ఆకాంక్షించారు. అనంతరం ముఖ్య అతిథులు ప్రదీప్ కుమార్ దంపతులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి, ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గోపాలమ్మ మాజీ ఎంపీటీసీ కృష్ణంరాజు , మాజీ వార్డు సభ్యుడు భాస్కర్ తో పాటు జీహెచ్ఎంసీ వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని ప్రదీప్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



రూ.65 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి

5 బాణాసంచా దుకాణాలకు ఫైర్ ఎన్ఓసీ జారీ, తనిఖీల కోసం రూ.75 వేలు డిమాండ్





రాజమహేంద్రవరం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 31 :

ఐదు బాణాసంచా దుకాణాలకు ఫైర్ ఎన్ఓసీ జారీ చేయడంతో పాటు, దుకాణాల తనిఖీల కోసం రూ.65 వేల లంచం తీసుకుంటూ రాజమహేంద్రవరం సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి (ఏడీఎఫ్ఓ) పి. శ్రీనివాస్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఫిర్యాదుదారుడు ఐదు బాణాసంచా దుకాణాలను నిర్వహిస్తుండగా, వాటికి సంబంధించిన పెసో లైసెన్సులు 2028, 2035 సంవత్సరాల వరకు చెల్లుబాటులో ఉన్నాయి. రాబోయే దీపావళి సీజన్‌లో తాత్కాలిక దుకాణాలకు ఫైర్ ఎన్ఓసీలు జారీ చేయడంతో పాటు, ఇప్పటికే ఉన్న దుకాణాల తనిఖీల కోసం ఒక్కో దుకాణానికి రూ.15 వేల చొప్పున మొత్తం రూ.75 వేలు ఇవ్వాలని ఏడీఎఫ్ఓ పి. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. చివరకు రూ.65 వేలు తీసుకునేందుకు అంగీకరించడంతో ఫిర్యాదుదారుడు ఏసీబీ రాజమహేంద్రవరం రేంజ్ అధికారులను ఆశ్రయించారు. ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు, అక్టోబర్ 30వ తేదీ సాయంత్రం 6.44 గంటలకు కోటిపల్లి బస్‌స్టాండ్ సమీపంలోని కార్యాలయంలో ఫిర్యాదుదారుడి నుంచి రూ.65 వేలు లంచం తీసుకుంటుండగా శ్రీనివాస్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి కుడిచేతి వేళ్లకు నిర్వహించిన ఫినాఫ్తలీన్ పరీక్షలో పాజిటివ్‌గా తేలినట్లు వెల్లడించారు. నిందితుడిని అరెస్టు చేసి, రాజమహేంద్రవరం ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. ఏసీబీ రాజమహేంద్రవరం రేంజ్ పరిధిలోని రాజమహేంద్రవరం ఫైర్ స్టేషన్‌లో అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న పి. శ్రీనివాస్‌ను రూ.65 వేల లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు ఏసీబీ అదనపు ఎస్పీ ఎస్. భావ్య కిషోర్ తెలిపారు. ఫిర్యాదుదారుడికి ఇప్పటికే చెల్లుబాటులో ఉన్న బాణాసంచా లైసెన్సులు ఉన్నప్పటికీ, దీపావళి సందర్భంగా ఏర్పాటు చేసే దుకాణాల తనిఖీలు, ఫైర్ ఎన్ఓసీల జారీ కోసం శ్రీనివాస్ రూ.65 వేలు డిమాండ్ చేశారని, ఇవ్వకపోతే దుకాణాలపై చర్యలు తీసుకుంటామని బెదిరించడంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించినట్లు వివరించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల కోసం ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ లి1064లి కు లేదా అదనపు ఎస్పీ నంబర్ లి9440446102లి కు ఫిర్యాదు చేయాలని, తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ, పోలవరం జిల్లాల ప్రజలు అవినీతి సమాచారాన్ని అందించి సహకరించాలని ఆమె కోరారు. ఈ దాడిలో ఏసీబీ అదనపు ఎస్పీ ఎస్. భావ్య కిషోర్, ఇన్‌స్పెక్టర్లు ఎన్.వి. భాస్కరరావు, డి. వాసుకృష్ణ, వై. సతీష్, కె. గోవిందరాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పెళ్లిళ్ల వెంకన్నను దర్శించుకున్న జిల్లా కలెక్టర్..



అమలాపురం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 31

పట్టణంలోని పెళ్లిళ్ల వెంకన్నగా ప్రసిద్ధిగాంచిన అమలాపురం శ్రీ భూ సమేత వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ శనివారం ఉదయం కుటుంబ సమేతంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ దేవస్థానం చైర్మన్ కంచిపల్లి అబ్బులు, ఈవో పివివి సత్యకుమార్ కలెక్టర్ దంపతులకు ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.లి ఈ సందర్భంగా చైర్మన్ కంచిపల్లి అబ్బులు కలెక్టర్ దంపతులను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ సంప్రదాయాల ప్రకారం కలెక్టర్ కుటుంబానికి మర్యాదపూర్వకంగా ఆతిథ్యం పలికారు.

విద్యుత్ అధికారుల అలసత్వం పై నిరసన

పోలీసుల రంగ ప్రవేశంతో సద్దుమణిగిన గ్రామస్తులు



ముమ్మిడివరం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 31:

నగర పంచాయతీ పరిధిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్తు అంతరాయం, విద్యుత్ అధికారులు అలసత్వంపై ముసిని వారిపాలెం, చిప్పలపాలెం గ్రామస్తులు సాయంత్రం 8 గంటలకు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. విద్యుత్ అధికారుల అలసత్వం నశించాలని, గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. సబ్ స్టేషన్ పక్కనే ఉన్న తన గ్రామాలలో విద్యుత్ స్తంభాలు ఏమీ పడలేదని, దూర ప్రాంతాల వారికి విద్యుత్ సరఫరా చేస్తున్నారని, తమ గ్రామానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ ఎందుకు చేయలేదని అధికారులు ను నిలదీశారు. తమ గ్రామాల్లో లైన్మెన్ రాంబాబు నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నారని, ఒక్క నెల కరెంట్ బిల్లు కట్టకపోతే లైన్ కట్ చేస్తారని, ఆపద సమయంలో అందుబాటులో ఉండటం లేదని గ్రామస్తులు తెలిపారు. ఎన్నోసార్లు తమ గ్రామాల్లో విద్యుత్ వల్ల ఏసీలు, ఫ్రిజ్లు కాలిపోయాయని, లైన్మెన్ కు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులు డౌన్డౌన్ అంటూ నినాదాలు చేసి, సబ్ స్టేషన్ ని గ్రామస్తులు ముట్టడించడంతో ముమ్మిడివరం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. దీంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రికల్ ఏ డి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10 గంటలకి విద్యుత్తు పునరుద్ధరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు తమ గ్రామాలకు వెళ్ళిపోయారు.

మంత్రి సుభాష్ సమక్షంలో టీడీపీలో చేరిన 20 మంది వైసీపీ శ్రేణులు

రామచంద్రపురం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 31:

రామచంద్రపురం రూరల్ మండలం తోటపేట గాంధీనగర్‌కు చెందిన 20 మంది వైఎస్సార్‌సీపీ శ్రేణులు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారందరికీ మంత్రి సుభాష్ టీడీపీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు ఆయన వ్యక్తిగతంగా అందిస్తున్న సామాజిక సేవలు తమను ఎంతగానో ఆకట్టుకున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలోనే తెలుగుదేశం పార్టీలో చేరినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అభ్యర్థి డాక్టర్ మడక రాంబాబు, టేకుమూడి సత్యనారాయణ, మాగాపు అమ్మిరాజు, పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పోలింగ్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ఓటు హక్కు వినియోగంలో ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమాలు పాటించాలి

ఎన్నికల విధులకు ఆటంకం కలిగిస్తే ఉపేక్షించేది లేదు: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

కడప, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 31

స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సూచించారు. నవంబర్ 1వ తేదీన జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో ప్రవేశ అనుమతులు, ఓటింగ్ విధానం, నిషేధిత చర్యలపై పలు మార్గదర్శకాలను వెల్లడించారు.

పోలింగ్ కేంద్రాల్లో పాటించాల్సిన నిబంధనలు

ఓటర్లు, ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ సిబ్బంది, అభ్యర్థులు, వారి ఎన్నికల ఏజెంట్లు, నిబంధనల ప్రకారం అనుమతి పొందిన వ్యక్తులు మాత్రమే పోలింగ్ కేంద్రాల్లోకి ప్రవేశించాలని తెలిపారు. అంధులు, శారీరక వైకల్యం లేదా అనారోగ్యంతో స్వయంగా నడవలేని ఓటర్లు తమ వెంట ఒక సహాయకుడిని తీసుకెళ్లవచ్చన్నారు. ఓటర్లు ఓటరు గుర్తింపు కార్డు లేదా ఆధార్, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్సు, పాన్ కార్డు తదితర ఎన్నికల సంఘం అనుమతించిన గుర్తింపు పత్రాల్లో ఏదో ఒకటి చూపించాలని సూచించారు. ఎడమచేతి చూపుడు వేలికి చెరగని సిరా గుర్తు వేయించుకుని, ఓటర్ల జాబితాలో పేరు పరిశీలన అనంతరం సంతకం లేదా వేలిముద్ర వేయాలన్నారు. బ్యాలెట్ పత్రం ద్వారా ఓటు వేసే సమయంలో ఓటింగ్ గదిలోకి వెళ్లి, నచ్చిన అభ్యర్థి గుర్తు ఎదురుగా నిర్దేశిత విధంగా ముద్ర వేసి, బ్యాలెట్ పత్రాన్ని మడిచి బ్యాలెట్ పెట్టెలో వేయాలని తెలిపారు. ఓటు వేసిన వెంటనే పోలింగ్ కేంద్రం నుంచి బయటకు వెళ్లాలని, అనవసరంగా సమయం వృథా చేయరాదని సూచించారు.

నిషేధిత చర్యలకు పాల్పడితే చర్యలు

పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో ఎన్నికల ప్రచారం చేయడం, ఓట్లు అభ్యర్థించడం నిషేధమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఓటర్లను వాహనాల్లో పోలింగ్ కేంద్రాలకు తరలించరాదని, పోలింగ్ కేంద్రాల వద్ద గొడవలు చేయడం, ఎన్నికల సిబ్బంది విధులకు ఆటంకం కలిగించడం, అధికారులను అడ్డుకోవడం వంటి చర్యలకు పాల్పడరాదన్నారు. ఇతరుల పేరుతో ఓటు వేయడం, దొంగ ఓటుకు పాల్పడటం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ఓటు గోప్యతకు భంగం కలిగించేలా బ్యాలెట్ పత్రాల వివరాలను నమోదు చేయడం, మొబైల్ ఫోన్లు, కెమెరాలతో ఓటింగ్ ప్రక్రియను చిత్రీకరించడం నిషేధమన్నారు. పొగాకు ఉత్పత్తులను పోలింగ్ కేంద్రాల్లోకి తీసుకురావడానికి అనుమతి లేదని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వెలుపల ఓటర్లకు ఆహారం, మద్యం పంపిణీ చేయరాదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మంత్రులు అభ్యర్థిగా లేదా ఓటరుగా మినహా ఇతర హోదాల్లో పోలింగ్ కేంద్రాల్లోకి ప్రవేశించరాదని స్పష్టం చేశారు.



సమస్యలుంటే అధికారులకు ఫిర్యాదు చేయాలి

పోలింగ్ కేంద్రాల్లో ఏవైనా సమస్యలు, అభ్యంతరాలు లేదా ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలు చోటుచేసుకుంటే అభ్యర్థులు, వారి ఏజెంట్లు జిల్లా ఎన్నికల అధికారి లేదా ఎన్నికల పరిశీలకుల దృష్టికి తీసుకెళ్లాలని కలెక్టర్ సూచించారు. అంతేకానీ పోలింగ్ కేంద్రాల్లో గందరగోళం సృష్టించడం, ఎన్నికల సిబ్బంది విధులకు ఆటంకం కలిగించడం వంటి చర్యలకు పాల్పడరాదన్నారు. ప్రతి ఒక్కరూ సంయమనం పాటిస్తూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలను గౌరవించాలని, ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు సహకరించాలని కలెక్టర్ కోరారు. ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలు, అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

అభివృద్ధి కొనసాగాలంటే కూటమి అభ్యర్థుల గెలుపు తప్పనిసరి

స్థానిక సంస్థల ఎన్నికల్లో మీరు వేసే ఓటు నేరుగా ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు చెందుతుంది – ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

అభివృద్ధి కొనసాగాలంటే స్థానిక సంస్థల్లో కూటమి అభ్యర్థుల గెలుపు తప్పనిసరి



ఆత్రేయపురం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 31:

స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కూటమి అభ్యర్థులకు వేసే ఓటు నేరుగా ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు చెందుతుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. ఆత్రేయపురం మండలంలో శనివారం వాడపల్లి వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని, అనంతరం జడ్పీటీసీ అభ్యర్థి గూడపాటి శ్రీనివాస్, ఎంపీటీసీ అభ్యర్థుల తరఫున కొత్తపేట జనసేన ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, బీజేపీ నాయకులతో కలిసి గ్రామ గ్రామాన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ – ఎన్నికల ముందు కూటమి ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ "చెప్పాం... చేస్తున్నాం... చేస్తూనే ఉంటాం" అనే నినాదంతో ముందుకెళ్తున్నామన్నారు. జగన్మోహన్ రెడ్డి 2019లో "ఒక్క ఛాన్స్ ప్లీజ్" అనడంతో ప్రజలు అవకాశం ఇచ్చారని, అయితే ఆయన పాలన కూల్చివేతలతో మొదలై అరాచకాలతో సాగి, ఆర్థిక విధ్వంసంతో ముగిసిందని విమర్శించారు. నవరత్నాలు నవ మోసాలుగా మారాయన్నారు. రైతు భరోసా కింద రూ.20 వేలు ఇస్తానని చెప్పి జగన్ కేవలం రూ.7,500 మాత్రమే ఇచ్చి మోసం చేశారని, కూటమి ప్రభుత్వం ఏడాదికి రూ.20 వేలు జమ చేస్తోందని తెలిపారు. శుక్రవారం ప్రతి అన్నదాత ఖాతాలో పీఎం కిసాన్ – అన్నదాత సుఖీభవ కింద రూ.7 వేలు జమ చేశామన్నారు. ఆత్రేయపురం మండల అభివృద్ధికి లొల్ల లాకుల పునర్నిర్మాణానికి నిధులు సాధించామని, వసంతవాడ వద్ద అమరజీవి జలధార పథకం కింద వాటర్ హెడ్ నిర్మాణం, గ్రామ గ్రామాన సిమెంట్ రోడ్లు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టామని, కోనసీమ తిరుమల వాడపల్లి అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నేతృత్వంలో ట్రిపుల్ ఇంజిన్ సర్కార్ కొనసాగాలంటే స్థానిక సంస్థల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

తుఫాను పంట నష్టాలపై కేంద్ర బృందానికి వివరించిన ఎమ్మెల్యే గిడ్డి

నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా కృషి చేస్తాం



అమలాపురం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 31:

ఆర్నాబ్ తుఫాను కారణంగా దెబ్బతిన్న పంటలను పరిశీలించేందుకు అంబాజీపేట మండలం గంగలకుర్రు గ్రామానికి వచ్చిన కేంద్ర బృందంతో కలిసి పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. దెబ్బతిన్న వరి, అరటి, కొబ్బరి పంటలను పరిశీలించి నష్టాల వివరాలను కేంద్ర బృందానికి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పి.గన్నవరం నియోజకవర్గంలో తుఫాను ప్రభావంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. పంట నష్టాల విషయాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లామని, రైతుల సమస్యలను వివరించామని పేర్కొన్నారు. కేంద్ర బృందానికి పంట నష్టాల తీవ్రత, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించినట్లు తెలిపారు. నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా, ప్రభుత్వ పరంగా తగిన పరిహారం అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు, అధికారులు, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పులివెందులలో ఓటు వేసేందుకు వైఎస్ జగన్‌కు అనుమతి

ఓటు వేసిన వెంటనే ఇంటికి వెళ్లాలి.. డీఐజీ స్పష్టీకరణ

జిల్లావ్యాప్తంగా 3 వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు

పులివెందుల, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 31

కడప జిల్లాలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పోలీసు శాఖ భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా సుమారు 3 వేల మంది పోలీసు బలగాలను మోహరించగా, పులివెందుల పట్టణంలో ప్రత్యేకంగా 700 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. పులివెందులలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అనుమతి కల్పించినట్లు సమాచారం. అయితే ఆయన ఓటు వేసిన వెంటనే ఇంటికి వెళ్లాలని డీఐజీ స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, ఘర్షణలు చోటుచేసుకోకుండా పోలీసులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఐజీ హెచ్చరించారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎన్నికల నియమ నిబంధనలకు సహకరించాలని పోలీసు అధికారులు సూచించారు.



అక్రిడిటేషన్ ఉన్న జర్నలిస్టులకు 100 మీటర్ల వరకు అనుమతి

పోలీసు సిబ్బందికి కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ సూచనలు



పులివెందుల, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 31:

మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో కలెక్టర్ జారీ చేసిన అక్రిడిటేషన్ కార్డులు కలిగిన జర్నలిస్టులను పోలింగ్ కేంద్రాల వద్ద 100 మీటర్ల పరిధి వరకు అనుమతించాలని కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ పోలీసు సిబ్బందికి సూచించారు. కడప నగరంతో పాటు జిల్లాలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ఏర్పాట్లలో భాగంగా ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులకు నిబంధనల ప్రకారం అనుమతి కల్పించాలని ఆదేశించారు. యూట్యూబ్ ఛానళ్ల ప్రతినిధులు, పీడీఎఫ్ పత్రికల విలేకరులు సరైన అనుమతులు లేకుండా పోలింగ్ కేంద్రాల వద్దకు రావడానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. ఎన్నికల విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది ఈ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని డీఐజీ కోయ ప్రవీణ్ సూచించారు.

ఘనంగా భారతదేశ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి వేడుకలు



బొల్లారం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 31

భారతదేశ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి వేడుకలను బొల్లారం డివిజన్ లో ఘనంగా నిర్వహించారు.డివిజన్ పరిధిలోని బాలాజీ నగర్ కాలనీలో ఉన్న ఇందిరా గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుండ్ల మహేందర్ రెడ్డి, స్థానిక బాలాజీ నగర్ వాసుల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా వర్ధంతి వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా గుండ్ల మహేందర్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశపు కీర్తిని ప్రపంచం నలుమూలల చాటిచెప్పిన ఉక్కు మహిళా ఇందిరాగాంధీ అని ఈ సందర్భంగా కొనియాడారు.ఆమె రాజకీయ, వ్యక్తిగత జీవితంలో ఎన్నో ఓడుదోడుకులను ఎదుర్కొని శక్తివంతమైన నాయకురాలిగా భారతదేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది అని అన్నారు.భారతదేశ మొట్ట మొదటి మహిళా ప్రధానిగా భాద్యతలు స్వీకరించినా మహిళా ఇందిరాగాంధి అని గుర్తు చేసారు.ఇందిరాగాంధీ ప్రధానిగా భాద్యతలు స్వీకరించిన తర్వాత ఎన్నో విప్లవాత్మమైన మార్పులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. భారతదేశ ప్రధానిమంత్రిగా రెండుసార్లు భాద్యతలు చేపట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయిడు, సుదర్శన్ రెడ్డి, ఆంజనేయులు, సందీప్ రెడ్డి, ఆదర్శ్,యువరాజ్, నగేష్, రాకేష్, గోకుల్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త తొలగించలేదని రోడ్డుపై దుంగలు వేసి నిరసన

అమలాపురం మాచిరాజు వీధిలో స్థానికుల ఆందోళన

మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి

నల్లా శ్రీధర్ చొరవతో సద్దుమణిగిన వివాదం

అమలాపురం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 31

అమలాపురం పట్టణంలోని మాచిరాజు వీధిలో పారిశుధ్య సమస్యపై స్థానికులు ఆందోళనకు దిగారు. వీధిలో పేరుకుపోయిన చెత్తను మున్సిపల్ సిబ్బంది తొలగించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, రోడ్డుకు అడ్డంగా చెట్ల దుంగలు వేసి రాకపోకలను నిలిపివేశారు. పోలింగ్ బూత్‌కు సమీపంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యమే ఈ పరిస్థితికి ప్రధాన కారణమని స్థానికులు ఆరోపించారు. సమాచారం అందుకున్న సీఐ వీరబాబు పోలీసు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఇదే సమయంలో అమలాపురం మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి నల్లా శ్రీధర్ అక్కడికి చేరుకుని స్థానికులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకున్నారు. శ్రీధర్ వెంటనే జేసీబీని రప్పించి రోడ్డుపై పేరుకుపోయిన చెత్తను తొలగించేలా చర్యలు చేపట్టారు. దీంతో స్థానికులు ఆందోళన విరమించి, రాకపోకలకు మార్గం సుగమమైంది. పోలీసుల జోక్యం, నల్లా శ్రీధర్ చొరవతో వివాదం సద్దుమణిగింది. పోలింగ్‌కు సమీప ప్రాంతంలోనే ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. పట్టణంలో పారిశుధ్య నిర్వహణపై మున్సిపల్ అధికారులు మరింత బాధ్యతగా వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు.



కోనసీమ తిరుమల వాడపల్లిలో వైభవంగా మూడో రోజు బ్రహ్మోత్సవాలు


హనుమద్వాహనంపై కోదండరామ అలంకరణలో దర్శనమిచ్చిన శ్రీ వేంకటేశ్వర స్వామి

వాడపల్లి, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 31:

కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో 14వ వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు కార్యక్రమాలను శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వివిధ పూజా కార్యక్రమాలు, హోమాలు, ప్రత్యేక సేవలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఆశ్వయుజ బహుళ షష్ఠి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం 8.45 గంటలకు అర్చకులు సంకల్పంతో కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సప్తకలశారాధన, స్వామివారికి అభిషేకం, ప్రధాన హోమాలు, దిగ్దేవతా బలిహరణ, మహాపుష్పయాగం తదితర వైదిక కార్యక్రమాలను ఆగమశాస్త్ర సంప్రదాయాల ప్రకారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం స్వామివారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం 5.30 గంటలకు స్వస్తి వాచనంతో మరో విడత ఉత్సవ కార్యక్రమాలను ప్రారంభించారు. ప్రధాన హోమాలు, సహస్ర దీపాలంకరణ సేవ, దిగ్దేవతా బలిహరణ, విశేషార్చన తదితర కార్యక్రమాలను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఆలయంలో దీపాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. రాత్రి 7.30 గంటలకు బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన హనుమద్వాహన సేవను వైభవంగా నిర్వహించారు.



కోదండరామ అలంకరణలో శ్రీ వేంకటేశ్వర స్వామివారు హనుమంతుడి వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి దివ్యమంగళ రూపాన్ని దర్శించుకునేందుకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వాడపల్లికి తరలివచ్చారు. హనుమద్వాహనంపై స్వామివారి ఊరేగింపును భక్తులు భక్తిశ్రద్ధలతో తిలకించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాహన సేవ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తుల గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. స్వామివారి దివ్యదర్శనం భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచింది. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు, వాహన సేవలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.



మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలి

ఆర్నాబ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణ,

పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత

నేత కార్మికులు, సముద్ర మత్స్యకారులకు 50 కేజీలు, పునరావాస కేంద్రాల్లోని బాధితులకు 10 కేజీల బియ్యం పంపిణీ

జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్

అమలాపురం, సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 31



ఆర్నాబ్ తుఫాన్ ప్రభావంతో జిల్లాలో ఏర్పడిన అంతరాయాలను తొలగించి, సాధారణ పరిస్థితులను పునరుద్ధరించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్ నుంచి జిల్లా స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో తుఫాన్ అనంతర పునరుద్ధరణ పనులు, విద్యుత్ సరఫరా, విద్యా, వైద్య రంగాల్లో మౌలిక సదుపాయాల కల్పన, బాధితులకు నిత్యావసరాల పంపిణీపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రానున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నిర్వహణలో ఎటువంటి విద్యుత్ సరఫరా అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని, పెండింగ్ పనులను తక్షణమే పూర్తి చేయాలన్నారు. అమలాపురం పట్టణ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేయాల్సిన 150 విద్యుత్ స్తంభాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు జిల్లాలో డివిజన్, మండల స్థాయిలో సుమారు 60 శాతం పునరుద్ధరణ పనులు పూర్తయ్యాయని వివరించగా, మిగిలిన పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేసి ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విద్యుత్ సరఫరా, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలను తక్షణమే పునరుద్ధరించాలని సూచించారు. ఆరోగ్య కేంద్రాల పరిసరాల్లో పడిపోయిన చెట్లను తొలగించి, రోగులకు, ముఖ్యంగా గర్భిణులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. శిథిలావస్థకు చేరిన ఆరోగ్య కేంద్రాల మరమ్మతులను పంచాయతీరాజ్ శాఖతో సమన్వయం చేసుకుని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలోని 1,300 పాఠశాలల్లో సుమారు 300 పాఠశాలలకు ప్రధాన మరమ్మతులు అవసరమని విద్యాశాఖ అధికారులు వివరించగా, సంబంధిత సైట్ ఇంజినీర్లు, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని పనులు వేగవంతం చేయాలని సూచించారు. తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పాఠశాల భవనాల భద్రతను క్షుణ్ణంగా పరిశీలించి, సేఫ్టీ ఆడిట్ పూర్తయిన తర్వాతే పాఠశాలలను తిరిగి ప్రారంభించాలని స్పష్టం చేశారు. విద్యార్థుల భద్రత విషయంలో ఎటువంటి నిర్లక్ష్యానికి తావివ్వరాదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, పాఠశాలలు, ఇతర ప్రభుత్వ భవనాల పరిసరాల్లో పడిపోయిన చెట్లు, శిథిలాలను తొలగించి పారిశుధ్య పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. రెండు, మూడు రోజుల్లో పరిశుభ్రత పనులు పూర్తి చేయాలని సూచించారు. తుఫాన్ కారణంగా పాక్షికంగా, పూర్తిగా దెబ్బతిన్న ఇళ్ల వివరాలను మండలాల వారీగా సేకరించి సమగ్ర నివేదికను సమర్పించాలని ఆదేశించారు. సముద్ర తీర ప్రాంతాలకు చెందిన మత్స్యకారులు, నేత కార్మికులకు ఒక్కొక్కరికి 50 కేజీల బియ్యం, పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న బాధితులకు ఒక్కొక్కరికి 10 కేజీల బియ్యం పంపిణీ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి వి. సుబ్బారావు, జిల్లా పౌరసరఫరాల అధికారి పి. విజయ భాస్కర్, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి సి.హెచ్. శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పులివెందులలో 700 మంది పోలీసులతో భారీ బందోబస్తు

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పోలీసుల కవాతు.. ప్రశాంత వాతావరణంలో పోలింగ్‌కు పటిష్ట చర్యలు

పులివెందుల, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 31



పులివెందుల మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సుమారు 700 మంది పోలీసు బలగాలను మోహరించారు. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో కవాతు నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి ఘర్షణలకు తావులేకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని డీజీపీ ఆదేశించిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎన్నికల సందర్భంగా బయటి వ్యక్తుల రాకపోకలపై ఆంక్షలు విధించారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు నడుచుకుంటూ పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని, వాహనాల వినియోగానికి దూరంగా ఉండాలని సూచించారు. ఓటు వేసిన అనంతరం పోలింగ్ కేంద్రాల వద్ద, బహిరంగ ప్రదేశాల్లో గుంపులుగా ఉండకూడదని తెలిపారు. ప్రతి ఓటరు తమకు కేటాయించిన వార్డులోని పోలింగ్ కేంద్రానికి మాత్రమే వెళ్లాలని స్పష్టం చేశారు. స్థానికేతరులు అనుమతి లేకుండా పట్టణంలో సంచరిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని భద్రతా ఏర్పాట్లు చేపట్టామని, ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని పోలీసు అధికారులు కోరారు.

మామిళ్లపల్లిలో ఆలూరి శ్రీవల్లికి ఘన స్వాగతం

పసుపు కండువాలతో కదం తొక్కిన మహిళలు..

కూటమి అభ్యర్థులకు అడుగడుగునా నీరాజనం

సంతమాగులూరు, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 31

సంతమాగులూరు మండల జడ్పీటీసీ కూటమి అభ్యర్థి ఆలూరి శ్రీవల్లికి శనివారం సాయంత్రం మామిళ్లపల్లి గ్రామంలో పసుపు దండు ఘన స్వాగతం పలికింది. బాపట్ల పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షుడు, ఆమె భర్త ఆలూరి శ్రీనివాసరావుతో కలిసి ప్రచారానికి చేరుకోగా, వందలాది మంది మహిళలు పసుపు కండువాలతో స్వాగతం పలికి ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. జడ్పీటీసీ అభ్యర్థి శ్రీవల్లితో పాటు మామిళ్లపల్లి ఎంపీటీసీ కూటమి అభ్యర్థి పరిటాల సుధారాణికి కూడా గ్రామంలో అడుగడుగునా నీరాజనం పలికారు.రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆశీస్సులతో కూటమి బలపరిచిన అభ్యర్థులుగా ఎన్నికల బరిలో నిలిచిన శ్రీవల్లి, సుధారాణికి స్థానిక కూటమి నాయకులు, మండల నాయకులు, గ్రామ నాయకులు పెద్ద సంఖ్యలో మద్దతుగా నిలిచారు. సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తేలప్రోలు రమేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొప్పాక కొండలు, మామిళ్లపల్లి గ్రామ నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో పాల్గొని అభ్యర్థులకు అండగా నిలిచారు. గ్రామంలో తెలుగుదేశం పార్టీకి ఉన్న ఆదరణ ప్రచారంలో స్పష్టంగా కనిపించిందని కూటమి నాయకులు పేర్కొన్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో పసుపు కండువాలతో తరలిరావడం, అభ్యర్థులకు ఘన స్వాగతం పలకడం ప్రచారానికి మరింత ఊపునిచ్చింది. గ్రామంలోని ప్రధాన వీధుల్లో నిర్వహించిన ప్రచారంలో కూటమి శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఆలూరి శ్రీవల్లి మాట్లాడుతూ, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తనకు అందిస్తున్న సంపూర్ణ సహకారం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. అందరి అండదండలతో జడ్పీటీసీ ఎన్నికల్లో తన విజయం తథ్యమనే ధీమా వ్యక్తం చేశారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో జాతీయ ఐక్యతా దినోత్సవం

సర్దార్ పటేల్ కు ఘన నివాళి

మార్కాపురం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 31

భారత ఉక్కు మనిషి, స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా మార్కాపురం జిల్లా పోలీస్ కార్యాలయంలో జాతీయ ఐక్యతా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా సర్దార్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి జాతీయ ఐక్యతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దేశ ఐక్యత, సమగ్రత, అంతర్గత భద్రతను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. సర్దార్ పటేల్ దేశ సమైక్యత కోసం చేసిన కృషి, త్యాగం ఎనలేనిదని, ఆయన స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ జాతీయ సమైక్యతా భావాన్ని ప్రజల్లో పెంపొందించాలని పోలీస్ సిబ్బందికి పిలుపునిచ్చారు.



చక్కనమ్మ చిక్కిందా ఏంటి?



బుల్లి తెర ద్వారా వెండి తెరపై అడుగు పెట్టి సుదీర్ఘ కాలంగా రంగుల ప్రపంచంలో వినోదాన్ని అందిస్తున్న ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్. ఇండస్ట్రీలో అడుగు పెట్టి పుష్కర కాలం దాటింది. హిందీ సీరియల్స్, హిందీ సినిమాలతో ప్రేక్షకులను అలరించే ప్రయత్నం చేస్తూ వచ్చిన ముద్దుగుమ్మకు లక్కీగా తెలుగు సినిమా 'సీతారామం' సినిమాతో హిట్ పడింది. ఆ సినిమాలో చిన్న పాత్ర కోసం మృణాల్‌ను దర్శకుడు హను రాఘవపూడి కలవడం జరిగిందని, కానీ ఆమెను చూసిన తర్వాత సీతా మహాలక్ష్మి పాత్రకు మృణాల్ అయితేనే బాగుంటుందనే నమ్మకంతో ఆమెను నటింపజేశాడు. ఆయన నమ్మకంను మృణాల్ నిలుపుకుంది, అంతే కాకుండా సీతా మహాలక్ష్మి పాత్ర గురించి ఎప్పటికీ తెలుగు ప్రేక్షకులు చెప్పుకునే విధంగా నటించి, అందంగా కనిపించి మెప్పించింది. అందుకే సీతారామం సినిమా మృణాల్ కెరీర్ లో చాలా స్పెషల్ మూవీ అనడంలో సందేహం లేదు.

టాలీవుడ్‌లో మృణాల్ ఠాకూర్‌కి...

హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్‌కి టాలీవుడ్ నుంచి మంచి ఆఫర్లు వచ్చాయి. కానీ ఈమెకు బాలీవుడ్‌లో స్టార్‌డం దక్కించుకోవడం ఆసక్తి. అందుకే టాలీవుడ్‌లో వరుసగా సినిమాలు చేస్తూ కూడా బాలీవుడ్‌లో ఆఫర్ల కోసం ప్రయత్నాలు చేస్తూనే ఉంటుంది. తెలుగులో డెకాయిట్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ అమ్మడికి మంచి హిట్ పడింది. అయితే తెలుగులో మరిన్ని సినిమాలు చేయడానికి మాత్రం ఈ అమ్మడు ఆసక్తి చూపడం లేదు అనేది కంప్లైంట్. బాలీవుడ్‌లో ఈ మధ్య కాలంలో రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమాల ఫలితంతో సంబంధం లేకుండా బ్యాక్ టు బ్యాక్ హిందీ సినిమాలు చేస్తూనే ఉంది. సౌత్ లో వస్తున్న ఆఫర్లను ఈమె సున్నితంగా తిరస్కరిస్తుందనే పుకార్లు వినిపిస్తున్నాయి. సౌత్ లో రాకా తర్వాత ఇప్పటి వరకు ఈమె కొత్త సినిమాను కమిట్ కాలేదు.

రాకా సినిమాలో మృణాల్...

అల్లు అర్జున్, అట్లీ కాంబోలో రూపొందుతున్న రాకా సినిమాలో ఈమె నటిస్తుందా అనే విషయంలో కూడా ఇప్పటి వరకు అధికారిక ప్రకటన రాలేదు. కొత్త సినిమాలు ఏమీ చేయక పోయినా ఎప్పటికప్పుడు అందమైన ఫోటోలు, వీడియోలతో మృణాల్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ ఉంటుంది. తాజాగా మరోసారి అందాల ఫోటోలతో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఏకంగా 16 మిలియన్‌ల ఫాలోవర్స్ ను కలిగి ఉన్న ఈ అమ్మడు రెగ్యులర్‌గా స్కిన్ షో ఫోటోలు, అప్పుడప్పుడు ఇలాంటి అందమైన ఔట్ ఫిట్ ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. స్కిన్ షో ఫోటోలు షేర్ చేస్తే వైరల్ కావడం పెద్ద వింతేమి కాదు, కానీ ఇలా నిండుగా ఉన్న ఫోటోలను షేర్ చేసిన సమయంలో కూడా వైరల్ అయితే అప్పుడు వారి బ్యూటీకి ఒక విలువ ఉన్నట్టు అని కొందరు కామెంట్స్ చేస్తున్నారు.



రాయల్ ఫ్రేమ్‌లో పాలక్.. గ్లామర్ ఓకే కానీ..

ఇన్‌స్టాగ్రామ్‌లో మృణాల్ ఫోటో షూట్...

స్కిన్ షో చేయకున్నా మృణాల్ ఇలాంటి ఫోటో షూట్స్ తో కూడా చూపు తిప్పనివ్వదని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఒక బ్రాండ్ ప్రమోటింగ్ ఫోటో షూట్ అని తెలుస్తోంది. బెంగళూరు డైరీస్ అంటూ ఈ ఫోటోలకు ఇన్‌స్టాగ్రామ్ లో మృణాల్ కామెంట్ పెట్టడం అందరి దృష్టిని ఆకర్షించింది. ఇక ఈ ఫోటోల్లో మృణాల్ ఠాకూర్ ను చూస్తూ ఉంటే కాస్త బరువు తగ్గినట్టు అనిపిస్తుందని, తన గత చిత్రాలతో పోల్చితే ఈ ఫోటోల్లో సన్నగా, చిక్కిందా అన్నట్లుగా కనిపిస్తుందని నెటిజన్స్ అంటున్నారు. మృణాల్ కెరీర్ ఆరంభంలో కాస్త ఎక్కువ బరువు కలిగి ఉండేది. అయినా కూడా చాలా అందంగా ఉండేది. అయితే కొందరు సన్నబడితే అందం తగ్గుతుందని అంటారు. కానీ మృణాల్ విషయంలో అది నిజం కాదని ఈ ఫోటోలు చూస్తే అర్థం అవుతుంది. చక్కనమ్మ చిక్కినా అందమే అన్నట్లుగా ఈ ఫోటోలకు మృణాల్ అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. ఈ ఫోటోలకు తెలుగు అభిమానులు తెలుగులో సినిమా ఎప్పుడు అంటూ కామెంట్స్ చేస్తున్నారు. మరి మృణాల్ సమాధానం ఏంటో మరి...!



Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776